RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 195 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 ఆగష్టు 2024 మంగళవారం పేజీలు : 4

## పోలింగ్ శాతంపై దుష్ప్రచారం

### ఎలాంటి తేడాలు లేవు .. ఎలక్షన్ కమిషన్ వివరణ

న్యూఢిల్లీ : పోలింగ్ శాతాల్లో భారీగా తేడాలు ఉన్నాయంటూ వస్తున్న విశ్లేషణలను ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ప్రకటించిన ఓట్ల శాతానికి, తుది ఓట్ల శాతానికి మధ్య మరీ ఎక్కువగా తేడా ఉందంటూ విశ్లేషణలు వచ్చాయి. అయితే ఇది తప్పుడు ప్రచారమని, ఎన్నికల ప్రక్రియకు అప్రతిష్ఠ కలిగించేందుకు జరుగుతున్న ప్రయత్నమని ఆరోపించింది. ఓట్ల శాతంలో భారీగా తేడాలు ఉన్నట్టు ఓట్ ఫర్ డెమొక్రసీ అనే సంస్థ తన విశ్లేషణలో గుర్తించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఈ తేడా అధికంగా ఉన్నట్టు తెలిపింది. తొలుత ప్రకటించిన పోలింగ్ శాతం కన్నా తుది పోలింగ్ శాతం బాగా ఎక్కువగా ఉందని పేర్కొంది.




# మూడు దశల్లో

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలు తేదీలు ఇవేనా

హైదరాబాద్ : తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపై చాలా కాలంగా ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఇప్పటికే పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి ముగిసి ఆరు నెలలు దాటడంతో, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే ఇప్పటికే అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాల పైన ఆయన చర్చించారు. వీలైనంత త్వరగా ఈ ఎన్నికలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు సూచనలు చేశారు. తెలంగాణలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం . సెప్టెంబర్ 21, 25 , 30 తేదీలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు ఎన్నికలు నిర్వహించే తేదీలు, ఓటర్ల జాబితా, ప్రస్తుత పరిస్థితి వంటి అన్ని అంశాలను పరిశీలిస్తున్నారు. వారం రోజుల పాటు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లడంతో , ఆయన తిరిగి వచ్చేసరికి పంచాయతీ ఎన్నికల నిర్వహణ అంశంపై ఒక క్లారిటీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. రేవంత్ ఆదేశాలు రాగానే ఎన్నికలకు సంబంధించి కసరత్తు మొదలు పెట్టాలని, ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేస్తుంది. సెప్టెంబర్ లో ఎన్నికలు కు వెళ్లేందుకు వీలవుతుందా లేదా అనే అంశం పైన పంచాయతీరాజ్ శాఖ అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచ్ ల పదవీకాలం ఫిబ్రవరి 2న ముగిసింది .దీంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనను ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది . సర్పంచ్ ఎన్నికలు ఇప్పటికే నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం దానిని వాయిదాలు వేస్తూ వస్తోంది. అయితే పూర్తి స్థాయిలో రుణమాఫీ తర్వాత గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తే తమకు కలిసి వస్తుందని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది .ఇప్పటికే రెండు విడతల్లో రుణమాఫీ చేయడం, ఆగస్టు నెల చివరి నాటికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో , ఈ తంతు ముగిసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారట.

# మిమల్ని ధీటుగా ఎదుర్కొంటాం.. కేటీఆర్‌పై అద్దంకి ఫైర్..




పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడుతుందని.. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ చేతకానితనం వలనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు పక్క పార్టీల వైపు చూస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్ తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోతున్నారని, తప్పని పరిస్థితుల్లో వాళ్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నామన్నారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడడానికి కేటీఆర్ చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. రాజకీయాల్లో బీఆర్ఎస్ నీతిగా వ్యవహరించడంలేదన్నారు. బీఆర్ఎస్ సరైన పద్ధతులను పాటించడం లేదని అద్దంకి దయాకర్ విమర్శించారు. రాష్ట్రంలో ఈ రకమైన పరిస్థితులు రావడానికి ప్రధాన కారణం కేసీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మాత్రమే లేవని.. దేశంలో ఇదో ప్రక్రియగా మారిపోయిందన్నారు. టీడీఎల్పీని, సీఎల్పీని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేసీఆర్, కేటీఆర్‌కు సిగ్గు అనిపించలేదా అని అద్దంకి ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్‌కు చట్టం, న్యాయం ఎందుకు కనిపించలేదన్నారు. రాజకీయాల్లో అందరికీ ఒకటే న్యాయం ఉంటుందని, మీకో న్యాయం, ఇతరులకు మరో న్యాయం ఉండదని అద్దంకి దయాకర్ తెలిపారు. చట్టపరమైన అంశాలను కాంగ్రెస్ ధీటుగా ఎదుర్కొగలదని తెలిపారు.

**కేటీఆర్ ఏమన్నారంటే..** ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాంయిపులపై మాట్లాడారు. తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, హరీశ్‌రావుతో కలిసి న్యాయకోవిదులతో సమావేశమయ్యారు. పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందని కేటీఆర్ ప్రకటించారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమవుతుందని, బీఆర్ఎస్ తరఫున త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తామని తెలిపారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు. పార్టీ పిరాయింపులకు పాల్పడినవారిపై కోర్టులో పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

**రెండు పార్టీల మధ్య వార్..** పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 10 మంది కాంగ్రెస్‌లో చేరగా.. ఒక ఎమ్మెల్యే తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నుంచి 9 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. తమ ఎమ్మెల్యేలు రాజీనామా చేయకుండా వేరే పార్టీలో చేరడంపై బీఆర్ఎస్ నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమందిపై హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 2/3వ వంతు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని సీఎల్పీని విలీనం చేసుకున్నారు. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడలేదు. ప్రసత్తం బీఆర్ఎస్ శాసనసభ పక్షం విలీనం కావాలంటే కనీసం 26 మంది కాంగ్రెస్‌లో చేరాల్సి ఉంటుంది. ఇప్పటికే 9 మంది చేరడంతో ఇంకా 17 మంది సభ్యులు అవసరం. ఈ క్రమంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. తాజాగా ఉప ఎన్నికలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. దీంతో అద్దంకి దయాకర్ కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు.




## మాజీ సీఎం కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు

భూపాలపల్లి: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావుకి బిగ్ షాక్ తగిలింది. డిజైన్ల మార్పు, నాణ్యత లోపాలే మేడిగడ్డ కుంగుబాటుకు కారణమంటూ ఆరోపిస్తూ దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణలో కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 5న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. మరో ఆరుగురికి కూడా నోటీసులు జారీ చేసింది. కాగా మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై రాజలింగంమూర్తి అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ దాఖలు చేశారు. డిజైన్లు మార్చడం, నాణ్యత లోపాల కారణంగానే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందంటూ పిటిషన్‌లో రాజలింగం మూర్తి ఆరోపించారు. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ అంతర్ రాష్ట్ర వంతెన కుంగిన విషయం తెలిసిందే. బ్యారేజీ బీ-బ్లాక్‌లో 19, 20, 21వ పిల్లర్ల మధ్య ఉన్న వంతెన సుమారు 30 మీటర్ల పొడవున.. ఒక ఫీటు వరకు కిందికి కుంగింది. రాత్రివేళ వంతెన కుంగిపోయిన విషయాన్ని మహారాష్ట్ర వెళ్లే ప్రయాణికులు గుర్తించి బయటకు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందంటూ విపక్షాలు అప్పట్లో మండిపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రభుత్వం మారడం.. బ్యారేజీని పరిశీలించడం అన్ని జరిగాయి. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ప్రాజెక్టును సందర్శించారు.

# రాష్ట్ర ఖజానాకు లిక్కర్ కిక్కు!




## పెరుగుతున్న మద్యం రెవెన్యూ గ్రోత్ రేట్..

హైదరాబాద్ : రాష్ట్ర ఖజానాకు లిక్కర్ ద్వారా ఆదాయం ఏటేటా పెగుతున్నది. రాష్ట్ర బడ్జెట్ సైజ్, సొంత ఆదాయమూ పెరుగుతున్నా.. కానీ వీటి వృద్ధి రేటుతో పోలిస్తే మద్యం నుంచి సమకూరే ఇన్‌కమ్ చాలా ఎక్కువ. రాష్ట్రం సొంత ఆదాయంలో దాదాపు 20% మద్యం వ్యాపారం నుంచే సమకూరుతున్నది. కరోనా సమయంలోనూ ఈ రంగం ఆదాయానికి ఢోకా లేదని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తేల్చింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వృద్ధి రేటు సగటున 15% కన్నా ఎక్కువే నమోదవుతూ ఉన్నదని పేర్కొన్నది. రాష్ట్ర స్వీయ ఆదాయం 2021-22 ఆర్థిక సంవత్సరంలో 61.49% చొప్పున పెరిగితే మద్యం ఆదాయం మాత్రం 85.56% వృద్ధి నమోదు చేసినట్టు నిర్ధారించింది. ఇది కేవలం ఎక్సయిజ్ పన్ను ద్వారా సమకూరే ఆదాయమే. దీనికి అదనంగా మద్యం మీద విధించే వ్యాట్ ద్వారా సైతం మరింత ఆదాయం అదనంగా సమకూరుతున్నది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సమర్పించిన ఆడిట్ రిపోర్టులో కాగ్‌పై విషయాలను వెల్లడించింది.

**ఐదేండ్లలో డబుల్ :** జీఎస్టీ, వ్యాట్, మైనింగ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, మోటారు వాహనాల పన్ను, నాన్-టాక్స్ రెవెన్యూ... ఇలా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నా వాటిలో సింహభాగం లిక్కర్ బిజినెస్ ద్వారానే వస్తున్నది. ఏటేటా మద్యం వ్యాపారం ద్వారా వస్తున్న ఆదాయం మొత్తం ఆర్థిక వృద్ధిరేటుతో పోలిస్తే చాలా ఎక్కువగా పెరుగుతున్నది. ఉదాహరణకు.. రాష్ట్ర ఎక్సయిజ్ ఆదాయం 2017-18లో 16.67% (అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే) వృద్ధిని నమోదు చేస్తే 2022-23 నాటికి అది 21.56 శాతానికి పెరిగింది. 2017-18లో ఎక్సయిజ్ ఆదాయం కేవలం రూ. 9,421 కోట్లుగా ఉంటే 2022-23 నాటికి రెట్టింపైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.25,617 కోట్లకు పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. మద్యం విక్రయాలపై వ్యాట్ రూపంలో సమకూరేది దీనికి అదనం. గత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల (రూ. 20,298 కోట్లు)తో పోలిస్తే దాదాపు రూ.5 వేల కోట్లు ఎక్కువ. ఫారిన్ లిక్కర్స్, స్పిరిట్స్, బీర్ల విక్రయాలు పెరుగుతున్నందున స్టేట్ ఎక్సయిజ్ డ్యూటీ ద్వారా ఎక్కువ ఆదాయం వస్తున్నదని కాగ్ ఆ నివేదికలో పేర్కొన్నది. ఈ రూపంలో 2021-22లో మొత్తం స్టేట్ ఎక్సయిజ్ ఆదాయం రూ.17,482 కోట్లు కాగా.. ఈ రూపంలో రూ.1,864 కోట్లు అదనంగా వచ్చిందని వివరించింది.

ఇక మాల్ట్ లిక్కర్ రూపంలో మరో రూ.492 కోట్లు సమకూరిందని నివేదించింది. మైనింగ్, స్టాంప్స్-రిజిస్ట్రేషన్స్, జీఎస్టీ, మోటార్ వెహికల్ టాక్స్.. ఇలాంటి రూపాల్లోని పన్నుతో పోలిస్తే స్టేట్ ఎక్సయిజ్ ప్లస్ వ్యాట్ రూపంలో మద్యం వ్యాపారం ద్వారా సమకూరుతున్నదనే ఎక్కువగా ఉంటున్నది.

కొత్తగా మద్యం దుకాణాల లైసెన్సు ఫీజు తదితరాల్లేకుండానే ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసుకోవడం గమనార్హం.

**అధికారులపై సీరియస్ :** మద్యం దుకాణాలతో పాటు, ఎలైట్ షాప్స్, బార్లు ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకోడానికి ఫీజును ఆలస్యంగా చెల్లించినా దానిమీద ఆఫీసర్లు పెనాల్టీ వేయడం లేదని కాగ్ ఆరోపించింది. ఎక్సయిజ్ పన్నును ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లించడంలో జాప్యం జరిగినా జరిమానా వసూలు చేయడంలేదని పేర్కొన్నది. హైదరాబాద్ సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో 179 మద్యం దుకాణాలు, ఎలైట్ షాప్స్, బార్ల గణాంకాలను విశ్లేషించిన కాగ్... సుమారు రూ.77 కోట్లను వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలిపింది. చర్యలు తీసుకుంటామని, పెనాల్టీ వసూలు చేస్తామని ఎక్సయిజ్ అధికారులు వివరణ ఇచ్చినా.. ప్రభుత్వానికి మూడుసార్లు గుర్తుచేసినా.. రిప్లయ్ రాలేదని పేర్కొన్నది. రాష్ట్రంలో యావరేజ్‌గా గరిష్ట స్థాయిలో 123 రోజులు ఆలస్యంగా టాక్స్, రెన్యూవల్ ఫీజు చెల్లించినట్లు పేర్కొన్నది.

**సంవత్సరం ఆదాయం (రూ.కోట్లలో) వృద్ధి రేటు (ముందు సంవత్సరంతో పోలిస్తే)** 2017-18 9,421 16.67%, 2018-19 10,638 16.45%,
2019-20 11,992 17.74%, 2020-21 14,370 21.56%,
2021-22 17,482 19.15%, 2022-23 18,471 21.56%
(నోట్ : వ్యాట్ ద్వారా వచ్చేది కలుపుకోకుండానే..)

# సంపాదకీయం

## తీసుకునే నాథుడు లేక బ్యాంకుల్లో మూలుగుతున్న 78 వేల కోట్లు !

బ్యాంకులను చూస్తే ముచ్చట వేస్తుంది. అక్కడ కరెన్సీ ప్రవహిస్తుంది. అది నీదా నాదా అని రాసిపెట్టి ఉండదు. దానికి ఏ రంగూ ఉండదు. ఎవరి ఖాతాలోకి జమ అయితే అది వారి హక్కు భుక్తం అవుతుంది. బ్యాంకులలో నోట్ల కట్టలు చూసిన వారికి అవన్నీ తమ పరమైతేనో అన్న చిలిపి కోరిక తట్టకుండా ఉండదు. బ్యాంకులు అంటే పది మంది సొత్తు. దాచుకునేది ఒకరు, అప్పులు తీసుకునేది ఒకరు. ఎగ్గొట్టేది ఒకరు, డబ్బులు ఉంచినా వెనక్కి తీసుకోని వారు కూడా మరో జాబితా ఉంది. ఇపుడు అలాంటి జాబితా గురించే చర్చించుకోవాల్సి ఉంది. మన దేశంలోని బ్యాంకులలో పేరుకుపోయిన క్లెయిం చేయని డిపాజిట్లు ఏకంగా 78 వేల కోట్ల రూపాయలు అని ఆర్థిక గణాంకాలు లెక్క తేల్చాయి. ఇది చాలా పెద్ద మొత్తం. అన్ని బ్యాంకులలో కలిపి ఇంత పెద్ద ఎత్తున నగదు అలా బ్యాకు సొరుగుల్లో పడి మూలుగుతోంది. ఇలా ఎందుకు మూలుగుతోంది అంటే డిపాజిట్లు చేసిన వారు మరణిస్తారు. వారు నామినీలుగా పేరు పెట్టిన వారు వచ్చి ఆ నగదు మాదే అని క్లెయిం చేసుకోవడం లేదని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో ఏ ఏటికి ఆ ఏడు ఈ విధంగా నగదు నిల్వలు అలా పేరుకుని పోతున్నాయట. ఈ డబ్బు బ్యాంకులు ఏమీ చేయలేనివి. వాటిని ఏ ఖాతాకూ మళ్ళించలేనివి. దాంతో ఇది అతి పెద్ద సమస్యగా బ్యాంకులకు మారింది అని అంటున్నారు. దీంతో ఈ సమస్య ఇపుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దేశవ్యాప్తంగా బ్యాంకులలోఇలా క్లెయిం చేయని డిపాజిట్ల సమస్యలకు తగిన పరిష్కారం చూపించే దిశగా కేంద్రం అడుగులు వేయబోతోంది. దాన్ కోసం బ్యాంకింగ్ చట్టాలలోనూ సవరణలు తేబోతోంది అని అంటున్నారు. ప్రస్తుతం బ్యాంకులలో చూస్తే సేవింగ్ ఖాతాలు కానీ ఫిక్సెడ్ ఖాతాలు కానీ ఒక నామినీనే అనుమతిస్తున్నారు. వారు కనుక ఆ డిపాజిట్ దారుడు మరణించిన సందర్భంలో సొమ్మును క్లెయిం చేసుకోకపోతే అది అలాగే మూలుగుతూ ఉంటుంది. అలా కాకుండా నలుగురు నామినీలను కనుక ఈ ప్లేస్ లో అనుమతితే వారిలో ఎవరో ఒకరు ఆ డిపాజిట్లను క్లెయిం చేసుకుంటారు అని కేంద్రం ఆలోచిస్తోందిట. దీని వల్ల కేవలం బ్యాంకులకు మాత్రమే కాకుండా బాండ్లు, డివిడెండ్ల సమస్యకు కూడా తగిన పరిష్కారం దొరుకుతుందని అంటున్నారు. దీంతో పాటు అనేక రకాలైన బ్యాంకింగ్ సంస్కరణలను కూడా ముందుకు తీసుకుని రాబోతున్నారు అని అంటున్నారు. ఈ బిల్లు పార్లమెంట్ ముందుకు తొందరలోనే వస్తుందని అంటున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి...

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్...







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. స్టేట్ లెవెల్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను శీగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు,

జిల్లా స్థాయిలో పరిష్కారం కానివి ప్రభుత్వ నిర్ణయంపై అదరపడివుంటే అటువంటి దరఖాస్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించా రు. సోమవారం ప్రజావాణి మీటింగ్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు IAS, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి మరియు డిప్యూటీ కలెక్టర్ సైదులు తో కలిసి దరఖా స్తులను స్వీకరించారు.

ప్రజావాణి కార్యక్రమంలో (108) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల ఏదైనా పాఠ్యాంశాలపై శ్రద్ధ వహించాలి....

### నేను జిల్లా పరిషత్ లోనే చదివి ఉన్నత స్థాయికి ఎదిగ.... ఎమ్మెల్యే మల్లారెడ్డి

### ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి





శామీర్ పేట, (గరుడ వార్త) : జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నామని తమను తాము తక్కువ అంచనా వేసుకోవద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. సోమవారం శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ లో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నానని విద్యార్థులు రంజి పడొద్దని, తాను చిన్నతనంలో జిల్లా పరిషత్ లోని విద్యను అభ్యసించి ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సూచించారు. పాలమ్మి, పూలమ్మి ఈ స్థాయికి ఎదిగానని విద్యార్థులకు తెలిపారు. ప్రస్తుతం ఎన్నో మెడికల్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం పచ్చదనం పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. పాఠశాల ఆవరణలో స్వచ్ఛదనం, పచ్చదనం లో భాగంగా మొక్కను నాటారు. అనంతరం బ్రాండ్ ను మోగిస్తూ విద్యార్థులను, యువకులను ఉత్సాహపరుస్తూ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్ పర్సన్ వాని వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శామీర్ పేటలో....మండల కేంద్రం శామీర్ పేట లో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా భారీ ర్యాలీనే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే అనారోగ్యాల పాలవుతారని చెప్పారు. విద్యార్థులచే పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సైదులు, శామీర్ పేట ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో మమతాబాయి, ఎంపీ ఓ, కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు చింతలపల్లిలో....మండల కేంద్రం మూడు చింతలపల్లి లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ఎంపీడీవో వత్సల దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా సంఘాలు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం లో భాగంగా మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## మాటు వేస్తున్నాయి.. దాడి చేస్తున్నాయి



పూడూరు: దామగుండం అటవీ ప్రాంతంలో మూగ జీవాలు శునకాల దాడిలో తీవ్ర గాయాల పాలవుతున్నాయి. కొన్ని మృత్యువాత పడుతున్నాయి. వీటిలో ప్రధానంగా జింకలే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నివారణ చర్యలు చేపట్టక పోవటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

నీరు తాగేందుకు వచ్చి.. తప్పించుకోలేక

పూడూరు మండల కేంద్రానికి సమీపంలో తిప్పాపూర్, దామగుండం, కండ్లపల్లి, మీర్జాపూర్ గ్రామాల శివారులో సుమారు 3,000 ఎకరాలకు పైగానే విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో జింకలు, లేళ్లు, కుందేళ్లు, అడవి పందులు, మన్నుబోతులు వంటి అనేక రకాల అడవి జంతువులున్నాయి.

దామగుండం రామలింగేశ్వర సామి ఆలయ సమీపంలో ప్రధాన కొలను అన్ని కాలాల్లోనూ నీటితో నిండుగా ఉంటుంది. జింకలు నీళ్లు తాగేందుకు వస్తుంటాయి. ఇదే అదనుగా మాటువేస్తున్న శునకాల గుంపు వీటిపై దాడికి పాల్పడుతున్నాయి. మగ జింకలే ఎక్కువగా కుక్కలకు బలవుతున్నాయి. మగ జింకల కొమ్ములు ఏపుగా పొడవుగా ఉండటంతో తప్పించుకునే క్రమంలో చెట్ల పొదల కొమ్మలకు తగిలి ఇరుక్కోవటంతో పరుగెత్తలేక శునకాలకు చికి బలైపోతున్నాయి.

నియంత్రణ కేంద్రం ఉన్నా నిరుపయోగం..

కుక్కల సంతానాన్ని తగ్గించేందుకు వికారాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శివారెడ్డిపేటలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శునకాల బెడద ఎక్కువగా ఉందని సమాచారం ఇస్తే మున్సిపల్ సిబ్బంది కుక్కలను పట్టుకుని కేంద్రానికి తీసుకురావాల్సి ఉంది. ఆడ, మగ జాతి వాటికి వర్తిస్తుంది. కానీ కొంత కాలంగా అలా సాగటం లేదు.

ఇవిగో ఉదాహరణలు

దామగుండం అటవి ప్రాంతంలో ఈనెల 12న గాయపడిన జింకను పశువుల కాపరులు గుర్తించి ఫారెస్టు సిబ్బందికి తెలిపారు. వారు తీసుకు వెళ్లి చికిత్స చేయించినా బతకలేదు. కుక్కల దాడిలో గాయపడి మృత్యువాత పడిందని అధికారులు తెలిపారు.

మే నెలలో అనంతగిరి అడవిలో ఓ జింకను కుక్కలు దాడిచేసి చంపేశాయి. పర్యాటకులు చూసి ఫొటోలు తీయటంతో విషయం బయటకు వచ్చింది.

గత ఏడాది ఏప్రిల్‌లో దామగుండంలో జింక మృతి చెందటాన్ని స్థానికులు గుర్తించి పరిశీలించగా కుక్కలు కొరికిన గాయాలు కనిపించాయి. అదే ఏడాది దామగుండం ఆలయ సమీపంలో ఓ జింకపిల్ల పడి ఉండటాన్ని పశువుల కాపరులు చూసి స్థానికులు చెప్పారు. ఇదీ కుక్కల పనేనని గుర్తించారు.

అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం

దామగుండం అటవీ ప్రాంతంలో కుక్కల సంచారం అరికట్టేందుకు దృష్టిసారిస్తున్నాం. వికారాబాద్‌లోని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందించాం. మరోసారి పై అధికారుల దృష్టికి తీసుకువవెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం. – వీరబాబు, అటవీ పర్యవేక్షకుడు, పూడూరు.

## శ్రావణమాస తొలి సోమవారం ప్రత్యేక పూజా

శామీర్ పేట, (గరుడ వార్తలు) : శ్రావణమాసం తొలి సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు కన్నుల పండుగ నిర్వహించారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకము, అర్చన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం మంత్రపుష్పం, హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి మొక్కులు తీసుకున్నారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట మండలం వివిధ గ్రామాలలోని ఆలయాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. అలియాబాద్ శ్రీ రత్నాలయ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.





## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి...

శామీర్ పేట, (గరుడ వార్త) : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ స్వశక్తితో ఎదగాలని యువ నాయకుడు క్యాతం మధు కృష్ణ తెలిపారు. సోమవారం మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ క్యాతం కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు క్యాతం మధుకృష్ణ ఎంపీడీవో వత్సలదేవితో కలిసి డ్వాక్రా భవనంలో మహిళలకు 30 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుకృష్ణ మాట్లాడుతూ మహిళలు ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని సూచించారు. కుట్టు శిక్షణకు ఇప్పుడు ఎంతో డిమాండ్ ఉందని, అందులో నైపుణ్యత కలిగిన శిక్షణ పొందితే వాళ్లు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. ప్రతి మహిళా స్వశక్తితో ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో దాత గా ముందుకు వచ్చి కుట్టు మిషన్ లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభారాణి, మాజీ సర్పంచ్ లు ఆంజనేయులు, కటికెల శ్యామల, నాయకులు కీసరి నర్సింలు, బాబు చారి, మహిళ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## ఈ-పర్మిట్‌తో మోసాలకు అడ్డుకట్ట

జగిత్యాల : ప్రభుత్వపరంగా ఈ-పర్మిట్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయటంలేదు. గతంలో చాలామంది వ్యాపారులు రైతుల వద్ద కొన్న పంట ఉత్పత్తులను జీరోకింద తరలించేవారు లేదా పంట విలువను తక్కువచేసి చూపేవారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పండటం, అక్రమ నిల్వలకు ఆస్కారం, రైతులను మోసగించేలా ఉన్న ఈ తంతును అరికట్టేలా మార్కెటింగ్‌శాఖ ఈ-పర్మిట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానం ప్రకారం వ్యాపారులు రైతుల వద్ద సరకును కొన్న తరువాత 1 శాతం మార్కెట్‌ఫీజును చెల్లిస్తారు. సరకును ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వచ్చినపుడు ఆన్‌లైన్‌ద్వారా మార్కెటింగ్‌శాఖ వెబ్‌సైట్‌లో సరకు వివరాలను నమోదు చేయాలి. ఎక్కడ కొన్నది, రైతు నుంచి ఎంత కొన్నది, చెల్లించిన ధర, ఎక్కడికి తరలిస్తున్నది, ఎంత ఎగుమతి చేస్తున్నారనే వివరాలన్నీ నమోదు చేయాలి. రైతు సెల్‌ఫోన్ నంబరుతో సహా వివరాలన్నీ అప్‌లోడ్ చేసిన తరువాతనే సరకు ఎగుమతికి ఆన్‌లైన్ అనుమతి వస్తుంది. ప్రతి పర్మిట్‌కు ఒక నంబరు జనరేట్ అవుతుంది. ఈ ఆన్‌లైన్ పర్మిట్ తీసుకుని వాహనాల్లో సరకును తరలిస్తున్నపుడు తనిఖీ అధికారులకు ఆన్‌లైన్‌లో పర్మిట్ నంబరును పరిశీలించినపుడు వివరాలన్నీ కనిపించాలి. ఎక్కడికైనా సరకులను తరలించే వీలుంటుంది.

**అతిక్రమిస్తే జరిమానా..** బియ్యం, మక్కలు సహా అన్నిరకాల పంట ఉత్పత్తుల ఎగుమతులకు ఈ-పర్మిట్ తప్పనిసరి కానుండటంతో రైతుల నుంచి సరకు ఎక్కడికి తరలింది, ఏ ప్రాంతంలో నిల్వచేశారు, గోదాముల్లోని నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి అక్రమ నిల్వలకు అవకాశం ఉండదు. ఈ-పర్మిట్ పద్ధతిని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు భారీగా జరిమానాలు విధించవచ్చు.

# వరదొస్తే మునక

కోరుట్ల: ఇది కోరుట్ల పట్టణంలోని ఫుల్‌వాగులోని వైకుంఠధామం. పట్టణంలో శ్మశానవాటిక లేకపోవడంతో ఫుల్‌వాగు స్థలంలో అప్పటిపాలకులు దీనిని నిర్మించారు. వాగు స్థలంలో చుట్టూ ప్రహరీ నిర్మించి నీటి సౌకర్యం కల్పించారు. రెండేళ్ల కిందట మున్సిపల్ నుంచి దాదాపు రూ. 1.30 కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. గతేడాది వాగులో వచ్చిన వరదలకు వైకుంఠధామం పూర్తిగా మునిగి ప్రహరీ, షెడ్లు దెబ్బతిన్నాయి.

కోరుట్ల పట్టణం ఆనుకొని సుమారు 2 కి.మీ పొడవునా ఫుల్‌వాగు (పెద్దవాగు) ఉంటుంది. పెద్దవాగుకు 100 అడుగుల దూరం వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలున్నాయి. ప్రభుత్వ భూములు, వాగులను పరిరక్షించాల్సిన పుర, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో వాగు స్థలాన్ని ఆక్రమించుకొని చదును చేసి ప్లాట్లుగా విక్రయాలు చేపట్టారు. నిరుపేద ప్రజలు తక్కువ ధరకు స్థలం లభిస్తుందని కొనుగోలు చేసి వాగులోనే నిర్మాణాలు చేపట్టారు. కొందరు ఏకంగా భవనాలు నిర్మించుకున్నారు. బల్దియా నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నేతల ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు ఇంటినంబర్లు కేటాయించడంతో విద్యుత్తు సౌకర్యం సమకూర్చారు. తర్వాత కాలనీలలో మురుగు కాలువలు, సిమెంట్‌రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించారు. కొన్నేళ్లుగా వాగులో వరదలు వచ్చినప్పుడల్లా కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయి. వర్షాకాలంలో ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతేడాది వచ్చిన వరదలకు వాగు ఒడ్డు, మధ్యలో నిర్మించుకున్న పలు ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి.

**పరిరక్షించాల్సిన అధికారులే**

ప్రభుత్వ భూములు, వాగులను పరిరక్షించాల్సిన రెవెన్యూ, పురపాల



కశాఖ అధికారులు అందులోనే అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.కోట్లు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించారు. గతేడాది వాగులో వచ్చిన వరదలకు వైకుంఠధామాలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు రూ.లక్షల ప్రజాధనం వెచ్చించారు. ఎస్సీకాలనీ వద్దనున్న వాగులో ఎకరం స్థలంను పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉద్యానవనం కోసం రెవెన్యూ అధికారులు అయిదేళ్ల కిందట కేటాయించారు. అందులో రూ. 40 లక్షలు వెచ్చించి పార్క్ నిర్మాణ పనులు ప్రారంభించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. రెండేళ్ల కిందట వచ్చిన వరదలకు ప్రహరీ పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలేశారు. వాగు ఒడ్డున ప్రభుత్వ ఉర్దూమీడియం పాఠశాలను నిర్మిచడంతో గతేడాది వరదలకు ప్రహరీ పూర్తిగా కూలిపోగా, వరదనీరు తరగతి గదుల్లో చేరి పాఠ్యపుస్తకాలు తడిచాయి.

ఇవి ఫుల్‌వాగులో అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లు. పట్టణంలోని ఎస్సీకాలనీని అనుకొని ఉన్న ఫుల్‌వాగులో అక్రమంగా కాలనీలు వెలిశాయి. గతేడాది వాగులో వచ్చిన భారీ వరదలతో కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. వాగులో వరద నీరు ప్రవహించినన్ని రోజులు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పలు ఇళ్లు వరద తాకిడికి పూర్తిగా కొట్టుకుపోయి ధ్వంసమయ్యాయి.

# పేరు మాయం.. అన్నదాత ఆగం

సిరిసిల్ల : ప్రభుత్వం రెండు విడతలు చేసిన రుణమాఫీలో చిక్కుముళ్లు వీడటం లేదు. మాఫీ అయినవారు ఆనందంతో ఉంటే.. కాని వారు ఎందుకు కాలేదోనని అయోమయానికి గురవుతున్నారు. తమ బ్యాంకు ఖాతా, పట్టాదారు పుస్తకాలు పట్టుకుని రైతు వేదికల్లోని ఏఈవోలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.జిల్లాలో రెండు విడతల్లో 35,700 మంది రైతులకు రూ. 251.35 కోట్లు మాఫీ అయింది. జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు ఇప్పటికీ 22 రకాల కారణాలతో 300 దరఖాస్తులు వచ్చాయి. వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఎక్కువగా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. వారి పేరున ఉన్న వ్యవసాయ భూమితో కుటుంబ సభ్యులు రుణం తీసుకున్నారు. భూమి ఒకరి పేరున, రుణం మరొకరి పేరున ఉన్న వారికి మాఫీ వర్తించలేదు.బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతు పేరు, ఆధార్ పేరు సరిపోకపోవడం, కొందరి ఆధార్ కార్డులలో ఇంటి పేరుకు బదులు కులం పేరు ఉన్నవి, వ్యవసాయ భూమి పాసుపుస్తకంపై ఉన్న పేరుకు ఆధార్‌లోని పేరుకు తేడా ఉండటం, రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని ప్రభుత్వం పేర్కొన్నా.. కుటుంబ నిర్ధారణ జరగని కారణంగా రేషన్ కార్డుల్లో పేర్లు లేనివారికి పంట రుణం మాఫీ కాలేదు. మరికొంత మంది కుటుంబం యూనిట్‌గా రూ. 2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వీరందరికీ చివరి విడతలో మాఫీ అవుతుందనే ఆశతో ఉన్నారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్‌లో స్వీకరించిన ఫిర్యాదులను సవరించేందుకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాలేదు. దీంతో ఫిర్యాదు చేసిన రైతులు రుణ మాఫీకి తాము అర్హత పొందుతామా అని వ్యవసాయ అధికారులను కోరుతున్నారు. రుణమాఫీ నిధుల మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. గ్రీవెన్స్‌లోని ఫిర్యాదులు పరిష్కారం అయ్యాక తిరిగి నిధులు ఎప్పుడు విడుదల చేస్తారనేది స్పష్టత లేదు. వినతులను పరిష్కరించి మాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

**చెల్లించిన రుణం చూపుతున్నారు**

దుబాయి వెళ్లే ముందు 2016లో కొలనూరు కేడీసీసీ బ్యాంకులో రూ. 70 వేలు పంట రుణం తీసుకున్నాను. తిరిగి వచ్చాక 2023 జులైలో తీసుకున్న రుణానికి వడ్డీతో సహా రూ. 71,500 చెల్లించి ఖాతాను మూసివేశాను. 2023 ఆగస్టులో మళ్లీ సిరిసిల్ల కేడీసీసీ బ్యాంకులో లక్ష రూపాయల రుణం తీసుకున్నాను. వడ్డీతో కలిపి రెండో విడత మాఫీ జాబితాలో రాలేదు. దీనికి బ్యాంకు అధికారులను సంప్రదిస్తే నా పేరు మీద మొత్తం రూ. 1.78 లక్షలు ఉన్నట్లు చెబుతున్నారు. పాత రుణం వడ్డీతో సహా చెల్లించినా జాబితాలో చూపుతోంది.
– అన్నబోయిన శంకరయ్య, ధర్మారం

**జాబితాలో పేరు లేదని...**

నా భర్త వెంకటేశం 2020లో దుబాయి వెళ్లే ముందు స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 45 వేలు పంట రుణం తీసుకున్నారు. ఏడాది తర్వాత బ్యాంకు వారు రెన్యువల్ చేసుకుంటేనే రుణ మాఫీ వర్తిస్తుందన్నారు. మా ఆయన పేరున ఉన్న రుణ ఖాతాను నా పేరు మీదకు మార్చారు. వ్యవసాయ భూమి పాసుపుస్తకం మా ఆయన పేరున ఉండి రుణం నా పేరున ఉండటంతో మాఫీ జాబితాలో లేదని అధికారులు చెబుతున్నారు.
– దొంతరవేణి పద్మ, నిమ్మపల్లి

**నివేదిక పంపుతాం**

రైతుల నుంచి వచ్చే వినతులను క్లస్టర్‌ల వారీగా ఏఈవోలు స్వీకరిస్తున్నారు. వాటిని జిల్లాలోని గ్రీవెన్స్ సెల్‌లో నమోదు చేస్తున్నాం. మూడో విడత పూర్తికాగానే వినతులను ఉన్నతాధికారులకు పంపుతాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే దానికి అనుగుణంగా పరిష్కారం చేస్తాం.
– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

రుణమాఫీ వివరాలు మొదటి విడత మాఫీ అయినవారు: 23,785
జమ చేసిన మొత్తం: రూ. 135.35 కోట్లు రెండో విడత అర్హులు: 11,915 జమ చేసినది: రూ. 116 కోట్లు బ్యాంకు శాఖలు: 18
గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులు: 300

# మరమ్మతులకే డబ్బుల్లేవు.. చెత్త తరలించేదెలా?

సారంగాపూర్: 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కాలంగా నిధులు రావడంలేదు. మొన్నటి వరకు సర్పంచులు ఉంటే వారే చూసుకునే వారు. ఇప్పటికే జేబుల నుంచి డబ్బులు పెట్టి పనులు చేయించాం. వచ్చే జీతం అరకొర ఉంటుంది. దీనికి తోడు గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న ట్రాక్టర్ల కిస్తీలు కట్టకపోవడంతో బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. చిన్న పంచాయతీలు కావడంతో ఎలాంటి ఆదాయ మార్గాలు లేక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నాం. అక్కడిక్కడ అప్పుచేసి అంతోఇంతో చెల్లిస్తూ నెట్టుకొస్తున్నాం. ఇలా ఎన్ని నెలలు భారం మోయమంటారంటూ జిల్లాలోని చిన్న పంచాయతీ కార్యదర్శుల ఆవేదన.' బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయిలో 102 జనాభా కలిగి ఉండగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెల కేవలం రూ. 12 వేలు వస్తుంది. ఇందులో ట్రాక్టర్ కిస్తీకే రూ. 10 వేలు చెల్లిస్తుండగా, పంచాయతీ కార్మికుడికి రూ. 9,500లు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా ఖర్చులు, ట్రాక్టర్ మరమ్మతులు, క్లోరినేషన్, తదితర అవసరాలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలి. సారంగాపూర్ మండలంలోని నాయకపుగూడెం పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు మూడు నెలలుగా డబ్బులు లేకపోవడంతో మూలన పడేశారు. పంచాయతీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ చేయకపోవడం తో గ్రామస్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పక్కనే ఉన్న సారంగాపూర్ పంచాయతీ ట్రాక్టర్ తీసుకొచ్చి చెత్తను సేకరించాల్సి వస్తోంది. పారిశుధ్య నిర్వహణకు గత ప్రభుత్వం చెత్తను తరలించేందుకు ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌తోపాటు ట్యాంకర్, ఇతర పనిముట్లు కొనుగోలు చేసింది. ట్రాక్టర్ల కిస్తీల రుణ చెల్లింపు చిన్న పంచాయతీలకు మోయలేని భారంగా మారింది. ఆదాయ మార్గాలు లేక బ్యాంకు కిస్తీలు చెల్లించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుర్భర పరిస్థితి. జిల్లాలో 380 పంచాయతీలు ఉండగా గత ప్రభుత్వం దాదాపుగా 60 తండాలను పంచాయతీలుగా మార్చింది. ఆయా పంచాయతీలలో నెలసరి వచ్చే నిధులు కిస్తీలు, పారిశుద్ధ్య కార్మికుల చెల్లింపులకు సరిపోవడం లేదు. దీనికి తోడు నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. కుంటుపడుతున్న అభివృద్ధి పంచాయతీలలో అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్యంపై అధికారులు చేతులెత్తేస్తున్నారు. చిన్న పంచాయతీలలో వసూలయ్యే ఏడాది ఇంటి పన్ను కేవలం రెండు, మూడు నెలల ట్రాక్టర్ కిస్తీలకు సరిపోవడంలేదు. విద్యుత్తు బకాయిలు, మరమ్మతులకు, క్లోరినేషన్ తదితర అవసరాలకు నిధులు సమకూరక అభివృద్ధి కుంటుపడుతుంది. ఏదైనా ప్రత్యేకంగా నిధులు పంచాయతీలకు జమ చేస్తే తప్పా గ్రామాల్లో పనులు చేసే పరిస్థితి లేదు.

# కమీషన్లే ప్రియం.. కొనుగోళ్ల పర్వం



హైదరాబాద్: విద్యుత్తు పంపిణీ సంస్థలో రూ.కోట్ల విలువైన పరికరాలు, సామగ్రి కొనుగోలులో గోల్‌మాల్ జరిగింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న కొన్ని సంస్థలు నాసిరకం సామగ్రిని అంటగట్టాయి. టెండర్లవేళ ఒకటి చూపించి, తర్వాత మరోటి సరఫరాచేశాయి. ఆ సంస్థల ముడుపులకు ఆశపడి గత యాజమాన్యంలో కొందరు పెద్దలు నాణ్యత పరిశీలించకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. కొత్తపరికరాల వైఫల్యంపై ఇప్పటి యాజమాన్యం ఆరాతీయడంతో గతంలోని బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి.

**సాకులతో తప్పించుకుంటూ..** దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ విద్యుత్తు లైన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కరెంట్ తీగలు, ఇన్సులేటర్లు, పిన్‌లు.. ఇలా ప్రతిదీ టెండర్ ద్వారా కొనుగోలు చేస్తుంటుంది. టెండర్ దక్కించుకున్న కొన్ని సంస్థలు డిస్కంలో కావాల్సినవారి చేతులు తడిపి నాణ్యత లేని పరికరాలను ఇన్నాళ్లు సరఫరా చేస్తున్నాయి. ఇలాంటి అక్రమాల నివారణకు టెండర్లలో కొన్ని నిబంధనలు చేర్చారు. సరఫరా చేసినదానిలో 2.5శాతం సామగ్రిని ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం.. నివేదిక ఆధారంగానే సదరు సంస్థ, గుత్తేదారులకు బిల్లులు చెల్లించాలి. కొన్నేళ్లుగా డిస్కంలో ఈ విధానమే అమలు కావడంలేదు. గతంలో పై స్థాయిలో ఉన్నవారిలో కొందరి నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే సంబంధిత అధికారులు దీన్ని అటకెక్కించారని సమాచారం. ఆయా సంస్థలనుంచి కొందరు అధికారులు, యాజమాన్యంలో పెద్దలు భారీగా కమీషన్లు దండుకున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కంపెనీలనుంచి పరికరాలు కొనుగోలు చేశారు. గతంలో సీఈ స్థాయిలో అధికారి ఒకరు అభ్యంతరం చెబితే పైస్థాయి నుంచి ఒత్తిళ్లతో ఆయన్ను ఆ స్థానం నుంచి తప్పించడం గమనార్హం.

**వైఫల్యాలతో వెలుగులోకి..**

ఇటీవల విద్యుత్తు అంతరాయాలను కొత్త యాజమాన్యం క్షుణ్నంగా పరిశీలిస్తోంది. కారణాలను ఫొటోలతో సహా సేకరిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఎక్కువ శాతం పరికరాల వైఫల్యమున్నట్లు గుర్తించింది. నాణ్యత లేకనే పరికరాలు తరచూ పాడవుతున్నట్లు నిర్ధారణకు వచ్చింది. యూజీ, ఏబీ కేబుల్స్ తొడుగులు పగిలిపోతున్నాయి. విద్యుత్తు స్తంభాలు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున కుప్పకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ కేబుల్స్, ఆర్‌ఎంయూల వరకు నాణ్యతలో రాజీపడినట్లు కొత్త యాజమాన్యం ఒక అంచనాకు వచ్చింది. అధికారులను ఆరా తీస్తే నాణ్యత పరీక్షలే చేయడం లేదనే విషయం వెలుగులోకి వచ్చింది.

**ప్రమాణాలకు తిలోదకాలు..**

ప్రమాణాల మేరకు లేని పరికరాలు, సామగ్రితో విద్యుత్తువ్యవస్థ తీవ్రంగా నష్టపోతుంది. విద్యుత్తు అంతరాయాలతో పాటు కొన్నిసార్లు ప్రమాదాలకు ఆస్కారం ఉంటోంది. సంస్థపై మరింత ఆర్థిక భారం పడుతుంది. కొందరు స్వప్రయోజనాల కోసం ఇష్టారీతిగా కొనుగోళ్లకు అనుమతి ఇచ్చి నాణ్యతకు తిలోదాకాలు ఇచ్చారు. కమిషన్లకు కక్కుర్తిపడి అవసరం లేకున్నా కొనడంతో స్టోర్లలో ఏళ్లపాటు మూలన పడేసిన ఘటనలు డిస్కంలో గతంలో జరిగాయి. రింగ్ మెయిన్ యూనిట్లే ఇందుకు ఉదాహరణ.

**పరీక్షించాకే ఇకపై బిల్లులు– ముషారఫ్ ఫరూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్**

సామగ్రి కొనుగోలులో లోపాలను ఇప్పటికే గుర్తించాం. కొన్ని సంస్థలు టెండర్ సమయంలో ఒకటి చూపించి... మరోటి సరఫరా చేస్తున్నాయి. సరఫరా చేసిన సామగ్రి ర్యాండమ్‌గా ఎంపిక చేసి నాణ్యత పరీక్షలు నిర్వహించాక, సంతృప్తికరంగాఉంటే బిల్లులు చెల్లించబోతున్నాం. టెండర్‌లోనే ఈ నిబంధన ఉన్నా ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైంది. పక్కాగా అమలు చేయబోతున్నాం.

# మత్స్య సంపదకు ఊతం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు చేపలు పట్టి జీవించే మత్స్య కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా రాయితీ కల్పిస్తోంది. దానికి తోడు ప్రతి పారిశ్రామికుడికి ప్రభుత్వమే ప్రీమియం డబ్బులు చెల్లించి అయిదు నెలల వరకు బీమాతో దీమా ఇస్తుంది. బుధవారం జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మత్స్య సంపదకు చేస్తున్న కృషిపై కథనం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాళేశ్వరం, ఎల్లంపల్లి, దిగువ, ఎగువ మానేరు, మధ్యమానేరు వంటి సాగునీటి ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వీటివల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా చెరువులు, కుంటల్లో నీరు నిలువ ఉండే అవకాశం కలుగుతుంది. దీంతో మత్స్య సంపదకు, చేపల ఉత్పత్తికి ప్రాధాన్యం పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు కోట్లకు పైగా పలు రకాల చేప పిల్లలు, 80 లక్షల వరకు రొయ్య పిల్లలను ఉచితంగా జలాశయాలు, చెరువులు, కుంటల్లో ప్రభుత్వం వదిలి చేయూతనిస్తుంది. దాదాపు 20 టన్నుల చేపల దిగుబడి వస్తుంది. ఇక్కడ పెరిగిన చేపలు రొయ్యలను కలకత్తా, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కేజీ కల్చర్ ద్వారా పెంచిన తిలాపియా చేపలను కూడా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

**లైసెన్స్‌లు జారీ**

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమం ద్వారా కూడా చేయూతనిస్తున్నారు. చేపల చెరువుల నిర్మాణానికి యూనిట్‌కు రూ. 7 లక్షలు, చేప పిల్లల పెంపకానికి రూ. 6 లక్షలు, హెచరీస్ నిధులు సమకూర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇవికాకుండా జలాశయంలో కేజీ కల్చర్ విధానంలో చేపలను పెంచే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుంది. చేపల చెరువుల నిర్మాణానికి, చేపపిల్లల పెంపకం కేంద్రాలకు దరఖాస్తులు కూడా తీసుకొని మంజూరుకు ప్రభుత్వానికి పంపించారు. దిగువమానేరు జలాశయంలో చేపలు పట్టుకునేందుకు 905 మందికి లైసెన్స్‌లు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో 50 వేల మంది మత్స్య పారిశ్రామికులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తుండగా వీరందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.అయిదు లక్షలు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 20 కుటుంబాలకు అందజేశారు.

**రాయితీపై వాహనాలు**

మత్స్యకార్మికులకు వలలు, బుట్టలు, ఐస్‌బాక్స్‌లు వంటి వాటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనాల కొనుగోళ్లకు రాయితీ ఇస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు ఆటోలు, మొబైల్ వాహనాలకు 60 శాతం రాయితీ, కొందరికి 40 శాతం రాయితీ ఇచ్చి కొనుగోళ్లు చేయించారు. దీంతో పట్టుకున్న చేపలను వెంటనే గ్రామాలకు, మార్కెట్లకు వెళ్లి విక్రయించడానికి మార్గం సులభతరమవుతుంది. మరికొన్నింటికి కూడా రాయితీ ఇస్తున్నారు. మత్స్య కార్మికుల్లో మహిళకు 60 శాతం రాయితీ ఇచ్చారు.

**చేయూతకు ప్రభుత్వం కృషి**
– విజయ, సహాయ సంచాలకురాలు, కరీంనగర్

చెరువులు, కుంటలు, జలాశయాల్లో చేపపిల్లలు పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. మత్స్య శ్రామికులకు చేయూతనివ్వడానికి ప్రభుత్వం రాయితీపై పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆర్థికాభ్యున్నతి సాధించేలా సద్వినియోగం చేసుకోవాలి.

# రక్త కణాలు లెక్కించేదెలా?

వేములవాడ : గ్రామీణ ప్రాంతాల్లోనూ కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించేందు కు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ అరకొర వసతులతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అన్ని రకాల టీకాలు, వివిధ పరీక్షలు నిర్వహించడమే కాకుండా రక్త కణాలు(సెల్ కౌంట్) లెక్కించే యంత్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)కు అందించారు. ప్రస్తుతం జిల్లాలో 90 మందికి పైగా డెంగీ పాజిటివ్ బాధితులు ఉన్నారు. ఇది కేవలం ప్రభుత్వ ఆస్పత్రులలో చేరిన వారు మాత్రమే. బాధితుల సంఖ్య పెరుగుతుండగా అందించిన పరికరాలు పనిచేయక పోవడంతో రోగ నిర్ధారణకు రక్త నమూనాలను జిల్లా అసుపత్రికి పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిత్యం దాదాపు వంద మందికి పైగా రోగులు వస్తున్నారు. వీరిలో ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉంటున్నారు.

**రెండు కేంద్రాల్లోనే..** జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాలకు రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాలను అందించారు. దీని ద్వారా డబ్ల్యూసీ, ఆర్‌బీసీతోపాటు పలు రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో కేవలం మల్యాల, పెగడపల్లి పీహెచ్‌సీలలోనే రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాలు ఉపయోగంలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరికరాలు పనిచేయడంలేదు. దీంతో ప్రస్తుతం ఉప కేంద్రాల పరిధిలో రాపిడ్(ఆర్‌డీటీ) కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించి పాజిటివ్ తేలితే మళ్లీ పరీక్షలకు జిల్లా స్థాయి ఆసుపత్రులకు పంపించాల్సి వస్తోంది. దీనివల్ల ఫలితాలు ఆలస్యమై రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. మండలాల్లో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో నిరుపేదలు వైద్య సేవల కోసం ఆందోళన చెందుతున్నారు.

**పీహెచ్‌సీలలో పనిచేయని సెల్ కౌంట్ యంత్రాలు**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో అవసరమైనన వ్యాధి నిర్ధారణ పరీక్షలకు రక్త, మూత్ర నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్స్ కేంద్రానికి పంపించి ఫలితాలు అందిస్తున్నారు. సేకరించిన నమూనాలు జిల్లాలోని టీహబ్‌కు చేరాక సిబ్బంది పరీక్షించి ఫలితాల నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. వచ్చిన ఫలితాన్ని బాధితుడి చరవాణికి పీడీఎఫ్ రూపంలో పంపించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో చరవాణికి పంపిన నివేదికను బాధితులు చూసుకోవడం ఇబ్బందిగా మారింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి నేరుగా ఫలితాన్ని పంపించి బాధితులకు ప్రింట్ రూపంలో ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రింటర్లు అందించినప్పటికీ దానికి సంబంధించిన సామగ్రి అందించకపోవడంతో నిరుపయోగంగానే ఉంటున్నాయి.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేయని రక్త కణాలు(సెల్ కౌంట్) యంత్రాల మరమ్మతు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. ఆరోగ్య కేంద్రాల వారీగా సమస్యను గుర్తించేందుకు టెక్నీషియన్ ద్వారా మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జ్వరాలతో బాధపడుతున్న వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. డెంగీ బాధితుల సంఖ్య పెరిగితే జగిత్యాలలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందించేలా ప్రణాళిక తయారు చేస్తున్నాం.– షమీయొద్దీన్, జిల్లా వైద్యాధికారి

# ఆలయ పరిసరాల్లో రహదారుల కబ్జా

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో చాలా వరకు రహదారులు ఇరుకుగా ఉన్నాయి. ఇలాంటి పట్టణంలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా రోడ్లను ఆక్రమించి డబ్బా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా రాజన్న ఆలయ పరిసరాలే కాకుండా ముఖ్యమైన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయడమే కాకుండా మరింత ముందుకు రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరింత ఇరుకుగా మారుతున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయ పరిసరాల్లో కొందరు డబ్బాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తూ దందా సాగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని జగిత్యాల బస్టాప్ వైపు రోడ్డు, లక్ష్మీగణపతి కాంప్లెక్స్ చుట్టూ, కట్ట కింద రోడ్డు ప్రాంతాల్లో చాలా వరకు రాజన్న ఆలయ వసతి గృహాలున్నాయి. మరోవైపు ఆలయ గుడి చెరువు కట్టను ఆనుకొని రహదారి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో కొంత మంది పలుకుబడి ఉపయోగించి రహదారులపై పెద్ద ఎత్తున డబ్బాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా రాత్రికి రాత్రే ఏర్పాటు చేసి ఇతరులకు అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటూ మున్సిపల్, ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరోవైపు భక్తులు, స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఇరుకు రోడ్లతో...**

ప్రధానంగా రాజన్న ఆలయానికి ప్రతి రోజు వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. వీరితో పాటు స్థానికులు, ఇతర గ్రామాల ప్రజలు పనుల కోసం వస్తుంటారు. దీంతో ఆలయ పరిసరాల రహదారులు జన సందోహంగా మారుతాయి. దీంతో పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి బద్దిపోచమ్మ ఆలయం, అంబేడ్కర్ కూడలి, ఆలయ ప్రధాన రహదారి, తిప్పాపూర్ కూడలి, కట్టకింద జగిత్యాల రోడ్డు, జాత్రగ్రౌండ్‌లు జనంతో కిక్కిరిసిపోతుంటాయి. ఇలాంటి సందర్భంలో వ్యాపారులు రోడ్ల ఆక్రమణలతో భక్తులు, స్థానికులు పడే అవస్థలు వర్ణణాతీతం. ఈ ఇబ్బందులు అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకు తొలగించడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ముఖ్యంగా రాజన్న ఆలయ పరిసరాలు, బద్ది పోచమ్మ ఆలయ పరిసరాల్లో రోడ్లన్నీ ఇరుకుగా ఉంటాయి. ఇలాంటి రహదారిలో దుకాణాలు వదిలి రోడ్లపైనే వస్తు సామగ్రి పెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. రహదారికి ఇరువైపులా దుకాణాల నిర్వాహకులు సగానికి పైగా రోడ్లను ఆక్రమిస్తున్నారు. ఆగస్టు 5 నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. దీంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

పట్టణంలో రహదారుల ఆక్రమణల ను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. భక్తులు, స్థానికులకు ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసు అధికారుల సమన్వయం తో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపడతాం.– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# నూతన ఒరవడి.. పెరిగేనా దిగుబడి

హుజూరాబాద్ : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఉమ్మడి జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో వ్యవసాయ శాఖతోపాటు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహించేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ ప్రత్యేక సాగు విధానంలో అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

524 ఎకరాల్లో సాగు లక్ష్యం

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 524 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తి సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ బాధ్యతల్ని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు అప్పగించింది. నూతన ఒరవడిలో పత్తి సాగు చేసేలా రైతులను ఎంపిక చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. సాధారణ పత్తి సాగుకు భిన్నంగా విత్తనాలను దగ్గర దగ్గరగా విత్తి మొక్కల సంఖ్యను పెంచడమే అధిక సాంద్రత సాగు విధానం. ఇందుకోసం ఎర్రనేలలు, చెల్క నెలలు ఉండే గ్రామాలను ఎంపిక చేస్తున్నారు.

అదనపు పెట్టుబడికి ఆర్థిక ప్రోత్సాహం



సాధారణంగా పత్తి సాగు కంటే అధిక సాంద్రత సాగులో రెతులకు పెట్టుబడి ఎక్కువ కావడంతో ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విత్తనాలు, కూలీలు, యంత్రాల వినియోగం, ఇతర ఖర్చులన్నీ కలిపి సగటున ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల పెట్టుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ అదనపు పెట్టుబడిని ఎంపిక చేసిన రైతులకు అందించేలా ప్రభుత్వమే ఇస్తుందని అధికారులు చెబుతున్నారు.

లాభాలు ఇవి..

సాధారణ పత్తి సాగులో ఎకరా విస్తీర్ణంలో 5,555 నుంచి 7,407 మొక్కలు ఉండటం వల్ల 7-8 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. అదే అధిక సాంద్రత సాగు పద్ధతిలో దగ్గరదగ్గరగా 29,629 మొక్కలు ఉంటాయని, తద్వారా ఎకరాకు 10-12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశమున్నట్లు పరిశోధనలో వెల్లడైనట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా జూన్‌లో పత్తి విత్తుకున్న రైతులు పంట సాగుకు 180-190 రోజులు పడుతుంది. విడతల వారీగా అయిదారు సార్లు పత్తి తీయాల్సి (ఏరడం) ఉంటుంది. అదే అధిక సాంద్రత విధానంలో పంటంతా ఒకేసారి పూత, కాత, దిగుబడి చేతికి వస్తుంది. పంట కాలం కూడా 150-160 రోజులే.. తెగుళ్ల ఆశించకముందే ఒకేసారి పంట చేతి వస్తుంది. విత్తన ఖర్చు కొంత పెరిగినా.. ఎరువులు, పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పైగా ఒకేసారి పత్తి తీయడం పూర్తయిన వెంటనే పంటను తొలగించి రెండో పంట సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

జాతీయ పత్తి పరిశోధన సంస్థ నిర్దేశించిన మేర అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేలా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. గతంలో ఈ విధానంలో సాగు చేసిన రైతులకు మంచి దిగుబడులు వచ్చాయి. రైతులను ఎంపిక చేసి సాగు చేసేలా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాం. సాధారణ విధానంలో పత్తి సాగు యాంత్రీకరణకు అనుకూలంగా ఉండదు. అదే నూతన విధానంలో అలాంటి సమస్య ఉండదు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి ఎంపిక చేసిన వారికి ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రోత్సాహం అందించనున్నాం.వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

# ఉచితానికి పచ్చజెండా..!

నల్గొండ : కరెంటు కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉచిత విద్యుత్తు వ్యవసాయ బోరుబావుల దరఖాస్తులకు పచ్చజెండా ఊపింది. దీంతో నల్గొండ జిల్లాలో పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది.గత రెండేళ్లుగా నల్గొండ జిల్లాలో అనావృష్టి తాండవం చేస్తోంది. నీటి కొరత కారణంగా పంటలకు నీరు అందక ఎండిపోయాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు ఎక్కువ సంఖ్యలో బోర్లు తవ్వించారు. జిల్లాను పరిశీలిస్తే అధికంగా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మండలాల్లో సుమారు ఏడు వేలకు పైగా కొత్త బోర్లు తవ్వించినట్లు సమాచారం. భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేసుకుంటున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో సైతం ఈ ఏడాది రైతులు పెద్ద మొత్తంలో బోర్లు తవ్వారు. ఆ బోరుబావుల కింద పంటలు సాగు చేయాలంటే కరెంటు కీలకంగా మారడంతో ప్రభుత్వం నిర్ధేశించిన పైకంతో కూడిన డీడీలను జత చేస్తూ రైతులు ఉచిత కరెంటు వ్యవసాయ బోర్ల సర్వీసుల కోసం దరఖాస్తులు చేశారు. అవి గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి.

10 వేల దరఖాస్తులకు గ్రీన్‌సిగ్నల్..దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ పరిధిలో గత ఏడాది కాలంగా 11706 మంది రైతులు ఉచిత విద్యుత్తు వ్యవసాయ బోరుబావుల సర్వీసుల కోసం దరఖాస్తు చేశారు. అందులో 1700 మంది రైతులు ఓఆర్సీ చెల్లించాల్సి ఉంది. మిగతా 10 వేల మంది రైతులకు వెంటనే కరెంటు కనెక్షన్లు విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యుత్తుశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

మూడు నెలల్లో పూర్తిచంద్రమోహన్, ఎస్ఈ

పెండింగ్‌లో ఉన్న ఉచిత వ్యవసాయ దరఖాస్తులను పరిష్కరించి సర్వీసులు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు డివిజన్ల వారీగా కసరత్తు చేపట్టాం. మూడు నెలల్లో 10 వేల సర్వీసులను విడుదల చేస్తాం.

# బడిలో భయం.. దృష్టిసారిస్తే నయం



పరిగి : భావి భారత పౌరులను తీర్చిదిద్దే జిల్లాలోని పాఠశాలలు ఆందోళన కలిగిస్తున్నాయి. అనేక చోట్ల మరమ్మతులకు నోచుకోక, పైకప్పులు పెచ్చులూడి కిందపడుతున్నా వాటిలోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు భయం భయంగా నెట్టుకొస్తున్నారు. పలు పథకాల పేరుతో మరమ్మతులు చేపడుతున్నా సజావుగా సాగడంలేదు. ఈ నేపథ్యంలో పరిశీలనాత్మక కథనం.

పరిగి మండలం మల్లెమోనిగూడ గ్రామంలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ఇక్కడే 100 మంది వరకు ఉండేవారు. పాఠశాల పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో తల్లిదండ్రులు పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉన్న నాలుగు గదుల్లో ఒకటి పూర్తిగా తాళం వేసేశారు. మరో రెండు గదులు పూర్తిగా బీటలు వారాయి.మున్సిపల్ పరిధి గాంధీనగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల పైకప్పు పెచ్చులు మొత్తం ఊడిపోయాయి. విద్యార్థులు కింద కూర్చోలేని పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే కూర్చున్న వారిపై పడుతోంది.

ధారూర్: మండల పరిధిలోని కుక్కింద ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన 5 గదులను అధికారులు కూల్చేయాలని సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఎంపికచేసిన వాటిని కూల్చివేయకుండా అలాగే వదిలేశారు. వర్షాలు కురిస్తే గోడలు తడిసి పైనుంచి పెచ్చులూడుతున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల భవనం నిర్మించి 60 ఏళ్లు దాటింది. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదుల్లో విద్యుద్దీపాలు, ఫ్యాన్లను మాత్రం ఏర్పాటు చేశారు. గతంలో రెండు, మూడుసార్లు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పాఠశాల భవనాన్ని పరిశీలించి పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించారు. తరువాత మరిచిపోయారు.దోమ: దోమ మండలం ఉదాన్‌రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో మూడు గదులున్నాయి. ఓ గది పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఇనుప చువ్వలు తేలాయి. చిన్నపాటివర్షం పడితే చాలు గది జలమయ మవుతుంది. పుస్తకాలు తడుస్తున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.

తాండూరు మండలం జిన్‌గుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పైకప్పు నుంచి వరదనీరు కారుతోంది. పెచ్చులూడి కిందపడుతున్నాయి. దీంతో ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయస్వామి ఆయా తరగతి గదులను వినియోగించకుండా తాళం వేయించారు.

అసంపూర్తి చోట్ల మరమ్మతులు చేపడతాం

-జి. రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

జిల్లాలోని అధిక శాతం పాఠశాలల్లో అమ్మ-ఆదర్శ పాఠశాల పథకం కింద మౌలిక సదుపాయాలను కల్పించాం. మన ఊరు-మన బడి కింద పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలివేసిన పాఠశాలలను మాత్రం అమ్మ ఆదర్శ పథకం కింద తీసుకోలేదు. దీంతో ఈ పాఠశాలల్లో పనులు చేపట్టకుండా అలాగే వదిలేశారు. ఈ పాఠశాలల్లో కూడా పనులు చేపట్టడానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నాం. వీలైనంత తొందరగా ప్రగతి పనులు అమలుచేస్తాం.

# అభివృద్ధికి అండగా.. రాజధాని రెండుగా!



హైదరాబాద్ : బాహ్యావలయ రహదారి (ఓఆర్‌ఆర్) వరకు ఉన్న గ్రేటర్‌ను రెండు మహా నగర కార్పొరేషన్లుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఓఆర్‌ఆర్ వరకు ఉన్న మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను, కొన్ని గ్రామాలను బల్దియాలో కలిపి ఒకే కార్పొరేషన్ చేస్తే సాంకేతికంగా ఇబ్బంది ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పినపుడు రెండు కార్పొరేషన్ల ఏర్పాట్లు వైపు ఆయన మొగ్గు చూపించారని తెలిసింది. ముంబయి నగరం మొత్తం రెండు కార్పొరేషన్లుగానే ఉంది. దీంతో అక్కడ అభివృద్ధి సాధ్యమైందన్న భావనలో ఉన్నారు. నగరంలోనూ అభివృద్ధి పనులు జరగాలంటే రెండు బలమైన కార్పొరేషన్లు ఉండాలని దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయమని సీఎం అధికారులను కోరారు. ఈ విలీనంపై గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కూడా చర్చకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో జరిగిన సమావేశంలోనూ జీహెచ్‌ఎంసీలో శివారు ప్రాంతాల విలీనంపై చర్చ జరిగింది. “ రాజధానికి ఓఆర్‌ఆర్ హద్దు కావాలి. లోపలున్న 2,100చ.కి.మీ భూభాగాన్ని రెండుగా విభజిద్దాం. ఒకటి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. రెండోది గ్రేటర్ సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. రాబోయే గ్రేటర్ నగరాల కోసం.. డివిజన్ల నుంచి పునర్విభజన ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. హైడ్రాలోని కింది స్థాయి అధికారి డివిజన్‌కు బాధ్యులుగా, తర్వాతి హోదాలోని వారు సర్కిళ్లు, జోన్లకు ఇంఛార్జులుగా ఉంటారు. అదే మాదిరి కొత్త గ్రేటర్ నగరాల పరిపాలన వ్యవస్థ నిర్మాణమవ్వాలి. అందువల్ల హైడ్రా నిర్మాణం జాగ్రత్తగా జరగాలి.”అని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఓఆర్‌ఆర్ లోపల.. : ఔటర్ లోపల.. జీహెచ్‌ఎంసీతోపాటు 7 నగరపాలక సంస్థలు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కంటోన్మెంట్ బోర్డు, ఐలా సంస్థలు కూడా ఉన్నాయి. ఓఆర్‌ఆర్‌తో హద్దు కలిగి, వెలుపల ఉన్న మరో 10 పంచాయతీలనూ జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని పురపాలకశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.విలీనం ఇలా..: గ్రామ పంచాయతీల కాలపరిమితి ఇప్పటికే ముగిసింది. వాటిని దగ్గర్లోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేస్తారు. ఆయా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల కాలపరిమితి జనవరి, 2025తో పూర్తవుతుంది. అప్పుడు.. వాటిని జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. విలీనం చేసేందుకు వీల్లేని గ్రామాలను ప్రత్యేక మున్సిపాలిటీలుగా ప్రకటిస్తారు. చివరగా.. జీహెచ్‌ఎంసీని రెండు భాగాలుగా విభజించి గ్రేటర్ నగరాలను ప్రభుత్వం ప్రకటిస్తుంది.

కొత్త ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ సేవలు..ఔటర్ వరకు బల్దియా విస్తరిస్తే హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) పరిధి మరింత పెరగనుంది. ఇప్పటికే ఆర్‌ఆర్‌ఆ ర్‌లోని కొన్ని ప్రాంతాలు హెచ్‌ఎండీఏ కింద ఉన్నాయి. ఇక మీదట ఆర్‌ఆర్‌ఆర్‌లోని మిగతా ప్రాంతాల వరకు హెచ్‌ఎండీఏను పెంచనున్నారు. దీంతో హెచ్‌ఎండీఏ జోన్ల సంఖ్య కూడా రెండింతలు కానున్నాయి.

# చెత్తబండి.. రాలేదండి!



కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ గాడి తప్పింది. గత ఎనిమిది నెలలుగా అస్తవ్యస్తంగా మారగా పట్టించుకునేవారే లేరు. కొన్ని డివిజన్‌లలో పక్కాగా పనులు చేస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఇష్టానుసారంగా మారింది. నగరంలో ప్రతి ఇంటి నుంచి చెత్తను తీసుకెళ్లడానికి డివిజన్ల వారీగా ప్రైవేటు కార్మికులకు అప్పగించారు. ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా.. కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. **ఎక్కడి వ్యర్థాలు అక్కడే..**

నగరంలోని కొన్ని డివిజన్‌లలో స్వచ్ఛ ఆటో రిక్షాలు సమయపాలన పాటించడంలేదు. దినం తప్పించి దినం రావాల్సి ఉండగా.. కొన్ని సార్లు మధ్యలో రాకపోవడంతో నాలుగు రోజుల వరకు ఇళ్లలో చెత్త పోగవుతోంది. రోజుల తరబడి అలాగే వదిలేస్తుండటంతో ఇంట్లో దుర్వాసన, ఈగలు, దోమలు వస్తున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా ఒక ఆటో 500 ఇళ్ల నుంచి మాత్రమే చెత్త సేకరించాలి. అయితే, ఆ ఆటోలకు ఇళ్ల సంఖ్య అధికంగా ఉండటం, వాణిజ్య సముదాయాల వైపు వెళ్తుండడంతో సాధారణ ఇళ్లను విస్మరిస్తున్నారు. ఇంటి యజమానులు ప్రశ్నిస్తే ఆటో మొరాయిస్తుందనే కారణాన్ని చెబుతున్నారు.

**పాటించని సమయపాలన** స్వచ్ఛ ఆటో కార్మికులకు సమయపాలన లేకుండా పోయింది. ఉదయం 5 గంటలకు కచ్చితంగా హాజరు పాయింట్‌కు రావాల్సి ఉంటుంది. ప్రతి నెలా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతకం తీసుకొని వస్తేనే.. వారికి బల్దియా రుణ సదుపాయం చెల్లించకూడదని ఇటీవల నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్, కమిషనర్ హెచ్చరించారు. అయినా అత్యధిక శాతం స్వచ్ఛ ఆటో కార్మికులు హాజు పాయింట్ వద్దకు రావడం లేదు.

**బ్యానర్లు ఏర్పాటు చేసినా..**భగత్‌నగర్, కట్టరాంపూర్, గణేశ్‌నగర్ బైపాస్, కలెక్టరేట్ రోడ్డు, బ్యాంకుకాలనీ, అశోక్‌నగర్, గాంధీరోడ్డు, కిసాన్‌నగర్, వాల్మీకినగర్, కాపువాడ, సుభాష్‌నగర్, రాంనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాలతోపాటు విలీన గ్రామాల్లో చెత్త సేకరణ సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఇంటి యజమానులు మూడు కూడళ్ల దగ్గర, రహదారి పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం పడేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేయొద్దనే బ్యానర్లు ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదు. నగరవాసుల్లోనూ మార్పు రావాల్సిన అవసరముంది. **రోజూ సేకరించాల్సిందే** అన్ని డివిజన్లలో రోజూ స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను సేకరించాలి. తడి, పొడి వేరు చేసి.. తడి చెత్తను కంపోస్టు యార్డుకు, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి.

# గ్రేటర్ సమగ్ర అభివృద్ధికి 'హైసిటీ'

హైదరాబాద్: బల్దియా పరిధిలో మౌలిక వసతుల కల్పనకు సరికొత్త పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నగరాన్ని అంతర్జాతీయ సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా దీనిని తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో వివిధ వ్యూహాత్మక పథకాల పేరుతో గ్రేటర్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో భాగంగా ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్‌ఎంపీ తదితర వాటిని నెలకొల్పారు. ఈ పథకాల్లో భాగంగా చేపట్టిన కొన్ని పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వీటిని పూర్తి చేయడం, నూతన పనులను ప్రతిపాదిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రాధాన్య మౌలిక వసతులను కల్పించేందుకు 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్



ట్రాన్స్‌ఫార్మేటివ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్' (హైసిటీ) పేరుతో సరికొత్త పథకాన్ని అందుబాటులో తెచ్చారు. గతంలో చేపట్టిన పనులు పూర్తవ్వడానికి కావాల్సిన నిధులు.. తాజాగా పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం బల్దియా అధికారులను ఆదేశించింది. గతంలో గ్రేటర్‌లో 42 పనులు ప్రతిపాదించగా అందులో 35 పనులు పూర్తయ్యాయి. మరో 7 పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నాయి. ఎస్ఎన్‌డీపీ ద్వారా గ్రేటర్, దానికి ఆనుకొని ఉన్న మున్సిపాలిటీల్లో మొత్తం 58 పనులు చేపట్టారు. అందులో 39 పనులు పూర్తి చేశారు. మొత్తం 69.49 కిలోమీటర్ల పొడవునా నాలాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 42.48 కిలోమీటర్ల మేరకు పూర్తిచేశారు. నాలాల అభివృద్ధికి (ఎస్ఎన్‌డీపీ) హైసిటీ పథకంలో భాగంగా రూ.582.42 కోట్ల అంచనాతో 35 పనులు తాజాగా చేపట్టనున్నారు.

# అందని బిల్లులు.. చేసేదెలా పనులు!

పెద్దపల్లి : చిత్రంలో కనిపిస్తోంది ఎలిగేడు మండలకేంద్రంలో తాగునీటి పైపులైన్ గేటువాల్వు. లీకేజీ మరమ్మతు కోసం గొయ్యి తవ్వారు. పనులు పూర్తయ్యాక కొత్త గేట్‌వాల్వ్ బిగించడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలిగాయి.గత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. పల్లెల్లో మూలన పడిన చేతిపంపులు, బోరు మోటార్లు, బావులు, పగుళ్లు బారిన పడిన పైపులైన్లకు మరమ్మతు చేసేందుకు 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్' పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు దగ్గరుండి పనులు చేయించడంతో తాగునీటి సమస్య తొలగింది. అక్కడివరకు బాగానే ఉన్నా పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదు. గతంలో చేసిన పనుల్లో మళ్లీ లీకేజీలు ఏర్పడుతుండటంతో కలుషిత నీటి కష్టాలు తప్పడం లేదు.

171 పనులు.. రూ.1.83 కోట్లు

జిల్లాలోని 266 పంచాయతీల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా మొత్తం 1,47,579 కనెక్షన్లున్నాయి. జిల్లావ్యాప్తంగా 171 పనులకు రూ.1.83 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పైపులైన్ల లీకేజీని అరికట్టడంతో పాటు వృథాగా ఉన్న చేతిపంపులను వినియోగంలోకి తీసుకొచ్చారు. తాగునీటి బావుల్లో పూడిక తొలగించారు. పాడయిన మోటార్లకు మరమ్మతు చేశారు. కొన్ని చోట్ల బోర్లను అద్దెకు తీసుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలతో గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పాయి.

నిధుల కోసం వెదుకులాట

మూడు నెలల కిందట పనులు హడావుడిగా చేయడంతో లీకేజీ సమస్య మళ్లీ ఎదురవుతోంది. వానాకాలంలో లీకేజీలతో తాగునీరు



కలుషితమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేతిపంపులు మొరాయిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అనుమతి లేకుండానే పనులు చేశారు. దీంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. బిల్లుల చెల్లింపు లేక నిధుల కోసం వెదుక్కోవాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నయా పైసా రాలేదు

ధర్మారం: ఖిలావనపర్తిలో ఓఅండ్ఎం కింద అయిదు బోరుబావులను రూ.50 వేలకు పైగా వెచ్చించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మరమ్మతు చేయించారు. పనులు పూర్తి చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ నయా పైసా రాలేదు. ఒక్క ఖిలావనపర్తే కాదు, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. తాను రూ.1.20 లక్షలు ఖర్చు చేశానని, ఇప్పటికీ బిల్లులు రాలేదని మరో గ్రామ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా పంచాయతీ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ మొదలవనుండగా స్థాన చలనం కలిగితే పెట్టిన ఖర్చులు వస్తాయో లేదోనని కార్యదర్శులు వాపోతున్నారు.

అయిదు గ్రామాల్లో అప్పు తెచ్చి పనులు

ఓఅండ్ఎం(ఆపరేషనల్ మెయింటెనెన్స్) పథకం ద్వారా మండలంలోని పెద్దంపేట, ఇద్లాపూర్, మడిపల్లికాలనీ, అంకంపల్లి, చిన్నరాతుపల్లి గ్రామాలను ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేశారు. అయిదు గ్రామాల్లో అధికారులు అప్పు తెచ్చి మోటార్లు, పైపులైన్లు వేసి తాగునీరు సరఫరా చేయగా ఇప్పటివరకు బిల్లులు రాలేదని అధికారులు తెలిపారు.

# అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతమున్న పూర్వ ప్రాథమిక విద్యా బోధన అనుకున్నంత సత్ఫలితాల్విట్లేదని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. పిల్లల వయసుకు మించి సిలబస్ ఉన్నట్లు పరిశీలనలో తేలింది. వీటిని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఇటీవల అధికారులను ఆదేశించారు.

పాఠ్య పుస్తకాల్లో సమూల మార్పులు..

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పులు చేయాలని నిర్ణయించారు. ఆటపాటలతో చిన్నారులకు త్వరగా అర్థమయ్యేలా పాఠాలు బోధించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది అంగన్‌వాడీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. మొదటి విడతలో జిల్లా నుంచి ముగ్గురి చొప్పున సీపీడీవోలు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు ఆరు రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. త్వరలో మరికొందరికి రెండు విడతలో తర్ఫీదు ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారు మిగిలిన సిబ్బందికి అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

వసతుల కల్పన..మొదటి విడతలో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేయనున్నారు. ఆ భవనాలన్నీ ఒకే రంగు, డిజైన్లలో ఉండేలా ప్రణాళికలు వేస్తున్నారు. తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్తు తదితర కనీస సౌకర్యాల ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. చిన్నారులందరికీ ఏకరూప దుస్తులు అందించనున్నారు. గోడలపై ఆకట్టుకునే చిత్రాలు వేయాలని నిర్ణయించారు.

ఆరేళ్ల వరకు కేంద్రాల్లోనే..

ఇప్పటి వరకు అయిదేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచి.. తర్వాత పైతరగతులకు పంపేవారు. ఇక మీదట బాలలకు ఆరేళ్లు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉంచి.. ఆంగ్ల భాషలో బోధిస్తారు. అనంతరం వారు ఆంగ్ల భాష బోధన పాఠశాలల్లో మొదటి తరగతిలో చేరిపోవచ్చు.

అమలుకు చిత్తశుద్ధి అవసరం

విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు లాంటి మౌలిక సదుపాయాలు, కుర్చీలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు తదితర వాటికి సరిపడా నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. సిబ్బంది అందరికీ శిక్షణ తరగతులు పూర్తి చేయాలి. ముఖ్యంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది నియామకాలు చేపట్టాలి. వీటన్నింటినీ అధిగమించినప్పుడే అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయడం సాధ్యమవుతుంది.

నూతన సిలబస్‌పై అవగాహనహైదరాబాద్‌లో శిక్షణకు హాజరయ్యా. మారిన నూతన అంగన్‌వాడీ సిలబస్‌పై అవగాహన వచ్చింది. కొత్తగా చేపట్టే మార్పులు అమలైతే అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమవుతాయి. పిల్లల సంఖ్య పెరుగుతుంది.

స్వరూపరాణి, టీచరు, పోచమ్మవాడ, కరీంనగర్

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాం. మారిన నూతన విధానాలను ఉపయోగించుకొని కేంద్రాలను మరింత బలోపేతం చేస్తాం. త్వరలోనే రెండో విడత శిక్షణకు మరికొంత మందిని ఎంపిక చేస్తాం.ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

## రోగాలను 'కొని' తెచ్చుకోవడమే!

కరీంనగర్ : ఈ నెల 26న కరీంనగర్‌లోని ఓ స్టార్ హోటల్‌లో ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటల్లో కాలం చెల్లిన మసాలాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. సరిగ్గా ఏడాదిన్నర కిందట నగరంలోని పలు హోటళ్లు, దుకాణాల్లో అధికారులు ఇలాగే సోదాలు నిర్వహించారు. నాణ్యత లేని నూనెలతో పాటు అనవసర రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. నగరంలోని ఓ హోటల్‌లో అందించిన పెరుగులో పురుగులున్నట్లు ఫిర్యాదులందాయి.

ఏడాది కిందట జమ్మికుంటలోని ఓ బిర్యానీ పాయింట్‌పై వినియోగదారుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాలతో ఆహార భద్రత తనిఖీ అధికారులు పరిశీలించి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. ఇదే తరహాలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, గోదావరిఖని, పెద్దపల్లిలోని పలు హోటళ్లలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో విస్తుగొలిపే అంశాలు వెలుగుచూశాయి. తర్వాత కొందరు నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు కనిపించినా చాలా చోట్ల బాధ్యులపై కేసులు నమోదు చేయకుండానే వదిలేశారు.కరీంనగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రతి రోజూ సగటున 300 మంది కడుపు నొప్పితో వస్తున్నారు. ఇందులో దాదాపు 80 శాతం మంది తీసుకునే ఆహారం సరిగ్గా లేకపోవడం, బయటి పదార్థాలు తీసుకోవడం వల్లే ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిత్యం ఫుడ్ పాయిజనింగ్ సమస్యతో 2–3 వేల మంది బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ వేయి మంది వరకు గ్యాస్ట్రిక్ సమస్యతో ఆస్పత్రి మెట్లెక్కుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

కొవిడ్ తర్వాత నగరాల్లో బయట తింటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇటీవలి కాలంలో దాదాపు అన్ని పట్టణాలు, మండలకేంద్రాల్లో 10–20 శాతం హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు కొత్తగా వెలిశాయి. శని, ఆదివారాల్లో ఎక్కువ కుటుంబాలు రెస్టారెంట్లకు వెళ్లడానికే ఆసక్తి చూపుతున్నాయి. పురపాలికల్లో వీధికో కర్రీ పాయింట్ కనిపిస్తోంది. అన్ని చోట్లా మిర్చీ బజ్జీల బండ్లు దాదాపు రెట్టింపయ్యాయి.

మొక్కుబడిగా తనిఖీలు

33 లక్షలకు పైగా జనాభా ఉన్న ఉమ్మడి జిల్లాలో ఆహార తనిఖీ శాఖ పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. ఇద్దరు ఉన్నతాధికారులు రెండేసి జిల్లాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దాదాపు 5 వేలకు పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, 6 వేలకు పైగా తినుబండారాల దుకాణాలున్నాయి. వీటిలో తరచూ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా సిబ్బంది కొరతతో సాధ్యం కావడం లేదు. ఎక్కడైనా పదే పదే ఫిర్యాదు అందితేనే అధికారులు స్పందిస్తున్నారు. పైగా అప్పటికప్పుడు ఘటనా స్థలానికి వచ్చిన దాఖలాలుండటం లేదు. ప్రధాన పట్టణాల్లో ముందస్తు తనిఖీ జాడలు అసలే లేవు. కేవలం ఏడాదిలో ఇన్ని తనిఖీలు చేశామని నివేదికల తయారీ కోసం అప్పుడప్పుడు సోదాలు నిర్వహిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. చాలా హోటళ్లలో శుచి విషయంలో పట్టించుకున్న నాథుడే లేడు.

రసాయనాలతో ముప్పు కల్తీ, నాణ్యత లేని ఆహారంతో జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. పోషకాహారమని, రుచికరంగా ఉంటుందని చాలా మంది జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. నూనె, ఇతర పదార్థాల్లోని కల్తీ వల్ల బయటి ఆహారంతో 'అక్యూట్ డయేరియల్' వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తోంది. జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు బయటి ఆహారమే ప్రధాన కారణం. రుచి కోసం వాడే రసాయనాలతో ముప్పు వాటిల్లనుంది. అవి శరీరంలోని పలు భాగాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల ఉత్పత్తి, ప్యాకింగ్, రవాణా, విక్రయం, వినియోగం వరకు ఎక్కడా కల్తీ జరగకుండా నిఘా ఉండాలి. గతంలో ఆహార నమూనా పరీక్ష కేంద్రాలను జిల్లాల్లో ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరడం లేదు. దీంతో తనిఖీ సమయంలో సేకరించే నమూనాలను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకే పంపిస్తున్నారు.కల్తీకి అవకాశం ఉండే పదార్థాలు

పదే పదే కాచిన నూనె వాడకం.

పాలు, తేనె, మసాలాలు.

ఐస్‌క్రీమ్స్, తృణధాన్యాలు, పిండి.

కాఫీ పొడి, టమాటా సాస్‌లు, నెయ్యి.

పసుపు, కారం, ఇతర పొడి పదార్థాలు.

దాల్చిన చెక్క, మిరియాల్లోనూ నకిలీవి ఉంటాయి.

చాలా వ్యాధులకు కారణంఆహారంలో కల్తీ, శుభ్రత లేని పదార్థాలతో జీర్ణకోశ సమస్యలు పెరుగుతున్నాయి.

# మ్యాన్‌హోల్.. నాణ్యత నిల్



హైదరాబాద్ : నగరంలోని అనేక ప్రాంతాల్లో వరదనీటి నాలాల మ్యాన్‌హోళ్లు ఛిద్రమయ్యాయి. వాహనాల రాకపోకలతో ముక్కలయ్యాయి. కొన్నిచోట్ల మూతలు పూర్తిగా గల్లంతయ్యాయి. వాహనదారులు వాటిలో పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ఓ వైపున వర్షాలు, మరోవైపు పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో మ్యాన్‌హోళ్లతో ముప్పు పొంచి ఉందన్న ఆందోళన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. చిన్నారులు, పాదచారులు తిరిగే చోట ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లకు వేగంగా మరమ్మతులను చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాసిరకం పనులతో..

నగరంలో రెండు రకాల మ్యాన్‌హోళ్లు ఉంటాయి. గుండ్రనివి మురుగునీటి పైపులైన్లవి. చతురస్రాకారంలోని మ్యాన్‌హోళ్లు వరదనీటి నాలాలవి. గతంలో ఈ రెండు రకాలను గ్రానైట్ రాళ్లతో నిర్మించేవారు. దానివల్ల కొన్నేళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గుత్తేదారులు, ఇంజినీర్లు నాసిరకంగా పనులు చేస్తున్నారనే విమర్శలున్నాయి. గట్టిగా పిడికిలి బిగిస్తే చాలు.. ఆ ఇటుకలు పిండిగా మారుతాయి. వారానికే వాహనాల రాకపోకల వల్ల ఆ ప్రాంతం కుంగిపోతోంది. రెండు నెలలకే మ్యాన్‌హోల్ మొత్తం ధ్వంసమవుతోంది. వరదనీటి మ్యాన్‌హోళ్లదీ అదే పరిస్థితి.

బల్దియా నుంచి జలమండలికి

గతంలో శివార్లలో మురుగు నీటి వ్యవస్థ బల్దియా పరిధిలో ఉండేది. ప్రధాన నగరంలో మురుగునీటిని నిర్వహణ జలమండలి చూసేది. గత ప్రభుత్వం శివార్ల మురుగు నీటి వ్యవస్థను జలమండలిలో కలిపేయడంతో ఆయా సర్కిళ్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని అంటున్నారు. జలమండలికి బదిలీ అయిన తర్వాత నిర్వహణ పూర్తిగా పట్టించుకోవడం మానేశారని స్థానికులు చెబుతున్నారు.

పంజాగుట్ట మోడల్‌హౌజ్ వద్ద దాదాపు 10 మ్యాన్‌హోళ్లు ఉంటాయి. వాటిలో ఏ ఒక్క మూత సవ్యంగా లేదు. అన్నీ పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. పాతబస్తీ దారుల్‌సిఫా వద్ద పంజెతన్ కాలనీలో మూతలేని మ్యాన్‌హోల్‌లో పడి ఓ ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యారు. జీహెచ్ఎంసీ మాత్రం పగిలిన మూతల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు, మరమ్మతులను పక్కాగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రధాన రహదారులపై టన్నుల కొద్దీ బరువుండే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటి బరువును పరిగణనలోకి తీసుకుని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు మ్యాన్‌హోళ్లను నిర్మించాల్సి ఉంటుంది. కొందరు గుత్తేదారులు, ఇంజినీర్ల అవినీతి వల్ల అంతర్గత రోడ్లపైనే కాకుండా ప్రధాన రహదారులపైనా మ్యాన్‌హోళ్ల నిర్వహణ అధ్వానంగా మారింది.

మురుగునీటి మ్యాన్‌హోళ్లను జలమండలి నిర్వహిస్తోంది. సుమారు 6.5 లక్షలున్నాయి. నగరంలో 400 కి.మీ ప్రధాన, మరో 1,300 కి.మీ అంతర్గత నాలాలున్నాయి. కొన్నిరోడ్ల పొడవునా వరద ప్రవాహం కోసం నిర్మించినవి. వాటిపై ఉండే 2.5 లక్షల మ్యాన్‌హోళ్లను జీహెచ్ఎంసీ నిర్వహిస్తుంది.

ఇదీ లెక్క..

డీప్ మ్యాన్‌హోళ్లు 63,221

వీటిపై ఉన్న మొత్తం మ్యాన్‌హోళ్ల సంఖ్య 6,34,919

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న డీప్ మ్యాన్‌హోళ్లు 26,798

శివారు మున్సిపాలిటీల్లో 4,200 కి.మీ

గ్రేటర్‌లో సివరేజ్ నెట్‌వర్క్ 5,767 కి.మీ

శివారు మున్సిపాలిటీల పరిధిలో 36,423

నిత్యం ఉత్పత్తి అయ్యే మురుగు 2100 మిలియన్ లీటర్లు

# సమీకృతం అసంపూర్ణం.. సమస్యలు నిత్యకృత్యం



పరిగి : తాజా కూరగాయలతో పాటు జిల్లా వినియోగదారులకు మాంసం, పాలు, పండ్లు ఒకే చోట విక్రయించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరత, ప్రభుత్వం మారడంతో పట్టించుకునే వారే లేకపోయారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసింది కాబటి ప్రభుత్వం వీటి పూర్తికి చొరవ చూపాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.నియోజకవర్గానికి ఒకటి.. రెండేళ్ల క్రితమే శ్రీకారం: జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున రెండేళ్ల క్రితం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆశయం మంచిదే అయినా పనులు అసంపూర్తిగా ఉండటంతో ఇటు వినియోగదారులకు అటు విక్రయదారులకు అవస్థలు తప్పడం లేదు. పలుచోట్ల ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో విక్రయాలు ఎక్కడ పడితే అక్కడ అమ్ముతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో దుకాణాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే వారు లేకపోయారు. కొన్నిచోట్ల నిర్మాణ పనుల్లోనూ నాణ్యత లోపించింది. పక్కాగా చేపట్టి పూర్తిచేసే విధంగా చూడాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

నాణ్యత నవ్వుల పాలు

కొడంగల్‌లో రూ.3.5కోట్లతో చేపట్టిన మార్కెట్ సముదాయం నిర్మాణ పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. పుర ఉన్నతాధికారిణి హరిచందన పరిశీలించి గుత్తేదారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి పనులు నిలిపివేయాలని ఆదేశించడంతో బ్రేక్ పడింది.

రైతులకు, వాహనదారులకు పాట్లు

పరిగిలో 2022 జూన్ 18న రూ.4.25కోట్ల అంచనా వ్యయంతో పరిగిలో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రెండంతస్థుల వరకు శ్లాబు పనులు పూర్తిచేసి వదిలేశారు. గతంలో అక్కడే కూరగాయల మార్కెట్ జరిగేది. పనులు ప్రారంభించడంతో స్థలా భావం కారణంగా మార్కెట్ యార్డు, ప్రధాన రహదారిపైకి మారింది. దీంతో వ్యవసాయ విపణిలో రైతులకు, గంజ్‌రోడ్డులో వాహన చోదకులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. సమీకృత మార్కెట్ పూర్తయితే కనీసం 40దుకాణాలకు అవకాశం లభిస్తుంది.

పిల్లర్ల స్థాయి దాటడంలేదు

జిల్లా కేంద్రంలో రూ.7.2కోట్ల వ్యయంతో 108 దుకాణాలను చేపట్టి పేదలకు ఇవ్వాలని తలపెట్టారు. పనులు మాత్రం పిల్లర్ల స్థాయి దాటి కదలడంలేదు. లక్ష్యం ఏడాదిలోపే పూర్తిచేయాలని పెట్టుకున్నా నాలుగేళ్లయినా అతీగతీ లేకుండా పోయింది.

తాండూరులోనూ పరిస్థితి ఇలాగే ఉంది. రూ.7.2కోట్ల అంచనాతో చేపట్టినా పునాదులు కూడా దాటకపోవడంతో నిర్మాణ పనుల పట్ల అనుమానం వ్యక్తమవుతోంది. వాణిజ్య పరంగా ఎదుగుతున్నా సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ వెనుకబడిపోతోంది. దీంతో రైతులు, చిరు వ్యాపారులు రోడ్లపైనే విక్రయించక తప్పడం లేదు.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం

స్థానికంగా ఉన్న సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అదనపు నిధులు విడుదలయ్యే విధంగా కోరుతాం. వినియోగదారులకు ఉపయోగపడే విధంగా తొందరలో అందబాటులోకి తెచ్చే విధంగా చూస్తాం. – వెంకటయ్య, కమిషనర్, పరిగి.

# డ్రోన్లతో మందు.. ఇక వద్దు

హైదరాబాద్: దోమల నియంత్రణకు ఉపయోగిస్తోన్న డ్రోన్లు నిరుపయోగంగా మారాయని, వాటికి చేస్తోన్న ఖర్చు వృథా అని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. వాటి సేవలను రద్దు చేసింది. డ్రోన్లతో పిచికారీ చేస్తోన్న మందుతో దోమల కట్టడి సాకారం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జోనల్ అధికారులు వెల్లడించారు. కొందరు సీనియర్ ఎంటమాలజిస్టులు వాటి పేరుతో నెలకు రూ.2.5లక్షలు ఖర్చు చేస్తున్నారని, ఫలితం మాత్రం సున్నా అని వాపోయారు. దోమల విభాగంలో అవినీతి అధికారులు పాతుకుపోయారని చెప్పేందుకు ఇదే నిదర్శనం.రోజూ రూ.10వేలు.. జీహెచ్ఎంసీలో ఆరు జోన్లు ఉన్నాయి. వాటి పరిధిలోని 185 చెరువులు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వర్షాలు మొదలైతే.. చెరువుల చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం నుంచి జనాలు బయట నిలవలేని పరిస్థితి ఉంటుంది. తలుపులు తీస్తే ఇళ్లలోకి దోమలు దండయాత్ర తప్పదు. సమస్య నివారణకు జీహెచ్ఎంసీ వేర్వేరు పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపడుతోంది. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వల్లో, సంపుల్లో, ఇంటి పైన ఉండే ట్యాంకుల్లో దోమలు ఉన్నాయా లేవా అని పరిశీలించే బాధ్యతలో 2వేల మంది సిబ్బంది పని చేస్తుంటారు. మరో 250 మంది ఫాగింగ్, మూసీ పరివాహక ప్రాంతాల్లో గుర్రపుడెక్క తొలగించి దోమల మందు పిచికారీ చేస్తుంటారు. అవి కాకుండా.. ఎక్కువ విస్తీర్ణంలోని చెరువులపై దోమల మందు పిచికారీ చేసి, వాటి ఉత్పత్తిని నియంత్రించేందుకు జీహెచ్ఎంసీ మూడేళ్ల కిందట డ్రోన్లను రంగంలోకి దింపింది. జోన్‌కు ఒకటి చొప్పున ఆరు డ్రోన్లను అద్దె ప్రాతిపదికన అధికారులు సిద్ధం చేశారు. నిబంధన ప్రకారం ఒక్కో డ్రోను రోజూ 1520ఎకరాల్లో ఎంఎల్ఓ రసాయనాన్ని పిచికారి చేయాలి. నాలుగు గంటలపాటు పనిచేయాలి. అయితే.. కొన్ని జోన్లలో డ్రోన్ల పనితీరు పూర్తిగా పడకేసింది. పలువురు సీనియర్ ఎంటమాలజిస్టులు పనిచేయకపోయినా, పనిచేసినట్టు చూపించి బిల్లులు తీసుకుంటున్నారనే విషయమై జోనల్ కమిషనర్లకు ఫిర్యాదులు వరుసకట్టాయి. మరోవైపు డ్రోన్లతో మందు చల్లినా చెరువుల్లో దోమల కట్టడి సాధ్యపడట్లేదని తేలింది. ఈ నేపథ్యంలో జెడ్సీలు వాటి సేవలను ఆపేశారు.రంగంలోకి ఎఫ్‌టీసీ యంత్రాలు.. గుర్రపుడెక్క తొలగింపునకు ఉపయోగించిన ఎఫ్‌టీసీ(ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్స్) యంత్రాల టెండరు గతేడాది చివర్లో ముగిసింది. సరిగా పనిచేయట్లేదనే ఫిర్యాదులతో అప్పట్నుంచి వాటి సేవల పొడిగింపునకు జీహెచ్ఎంసీ ఇష్టపడలేదు. ఈ క్రమంలో చెరువుల పరిస్థితి పడకేసింది. భారీ ఎత్తున పెరిగిన గుర్రపుడెక్కతో తటాకాలు పచ్చిక బయళ్లుగా మారాయి. దాంతో.. మళ్లీ జోన్‌కు ఒకటి చొప్పున ఎఫ్‌టీసీ యంత్రాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది.

# ఆకాశ మార్గం పుంజుకుంది వేగం

హైదరాబాద్ : నగరం నుంచి నిర్మించ తలపెట్టిన రెండు మహా రహదారుల నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) సిద్ధమవుతోంది. వీలైనంత తొందరగా పనులు ప్రారంభించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, డెయిరీఫాం వరకు 5.32 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ కారిడార్, కంటోన్మెంట్ రాజీవ్ రహదారి నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 11.12 కిలోమీటర్ల పొడవుతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ పనుల్లో కొంత జాప్యం జరిగింది. తాజాగా వీటికి సంబంధించి పనుల్లో కదలిక షురూ అయింది. కంటోన్మెంట్ ప్రాంతంలోని రాజీవ్ రహదారి, 44వ జాతీయ రహదారుల్లో నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల కోసం చేపట్టాల్సిన విస్తరణ పనులకు సంబంధించి తాజాగా మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు హెచ్ఎండీఏ, మిలిటరీ, డిఫెన్స్ ఎస్టేట్స్, కంటోన్మెంట్, రెవెన్యూ శాఖల అధికారులు రంగంలోకి



దిగారు. రహదారికి ఇరువైపులా అటు ఇటు 100 అడుగులు విస్తరించనున్నారు. ఈమేరకు అధికారుల బృందం రోడ్డు మధ్యలోని విభాగిని నుంచి ఇరువైపులా మార్కింగ్ పనులు చేపడుతున్నారు. అదేవిధంగా డబుల్ డెక్కర్ కారిడార్‌కు సంబంధించి ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి ప్రధాన రహదారిలో మార్కింగ్ పనులు షురూ చేశారు.నగదు రూపంలోనా.. టీడీఆర్ వైపా..?

రాజీవ్ రహదారిలోని జింఖానా మైదానం నుంచి హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, తూంకుంట, శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు మొత్తం 11.12 కిలోమీటర్ల మధ్య 300 ప్రైవేటు నిర్మాణాలను గుర్తించారు. అదేవిధంగా డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణంలో కూడా 200 పైనే ప్రైవేటు ఆస్తులను గుర్తించారు. రాజీవ్ రహదారి, 44వ జాతీయ రహదారుల్లో ఈ రెండు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం సైతం తమ ఆధీనంలో ఉన్న మిలిటరీ, డిఫెన్స్ ఎస్టేట్స్, కంటోన్మెంట్ బోర్డుకు చెందిన స్థలాలను అప్పగించేందుకు పచ్చజెండా ఊపింది. దీనికితోడు ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రైవేటు సముదాయాల యజమానులకు భారీగానే నష్టపరిహారం చెల్లించాలి. అయితే పరిహారం నగదు రూపంలో చెల్లిస్తారా...లేదంటే అభివృద్ధి బదలాయింపు హక్కు(టీడీఆర్) ఇస్తారా అనే దానిపై ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ టీడీఆర్‌పైనే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే కంటోన్మెంట్‌లో టీడీఆర్ వర్తించనందున బాధితులకు నగదు చెల్లించాల్సి వస్తే ఏం చేయాలన్న సందిగ్ధంలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఇరు కారిడార్లను నిర్మించేందుకు పరిహారంతో కలుపుకొంటే భారీగానే నిధులు అవసరమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు ఉన్న వెసులుబాటుపై ఇప్పటికే యంత్రాంగం దృష్టి సారించింది. వారం పది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

# ఆస్తి పన్ను వసూళ్లు.. పుర ఉద్యోగులకు బాధ్యత

వికారాబాద్ : జిల్లాలో నాలుగు పురపాలిక సంఘాలున్నాయి. వీటి పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను రెగ్యులర్ ఉద్యోగులతో వసూలు చేయించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల వసూళ్లలో అక్రమాలకు చెక్ పడుతుందనేది ప్రభుత్వ యోచన. ఇప్పటి వరకు ఉద్యోగుల కొరత కారణంగా జిల్లాలోని నాలుగు పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులతో వసూలు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.దీంతో వసూళ్ల బాధ్యతను రెగ్యులర్ ఉద్యోగులకు అప్పగించారు.

మార్చి, ఏప్రిల్ నెలల్లోనే అధికం

ఆర్థిక సంవత్సరం ముగింపు నెలలైన మార్చి, ఏప్రిల్‌లో తాత్కాలిక ఉద్యోగుల సేవలను అధికంగా వినియోగించుకుంటున్నారు. పన్ను బకాయిలున్న వారి జాబితా ప్రకారం వారి ఇంటి వద్దకు వెళ్లి పాత, మొండి బకాయిలు సైతం వసూలు చేస్తున్నారు.

ఇతర విభాగాల వారిని నియమిస్తారు

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో తాత్కాలిక ఉద్యోగులు సుమారు 600 మంది ఉన్నారు. ఒక్క వికారాబాద్ పురపాలికలోనే 243 మంది ఉద్యోగులున్నారు. పన్ను వసూళ్లకు రెగ్యులర్ ఉద్యోగులు సరిపోయేంత మంది లేరు. ఈ విభాగంలో లేకుంటే ఇతర విభాగాల్లోని వారిని



డిప్యూటేషన్‌పై నియమించుకునే అవకాశం ఉంది. పురపాలక ఉత్తర్వులను అమలు చేస్తూ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవడం ప్రారంభించారు.

జమచేసే క్రమంలో చేతి వాటం

మొత్తం 4 మున్సిపాలిటీల్లో 39,648 నివాసాలు నుంచి సుమారు రూ.10 కోట్ల వరకు ఏటా ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. దీనికి రెగ్యులర్ బిల్ కలెక్టర్లతో పాటు తాత్కాలిక పద్ధతి నియమించుకున్న బిల్ కలెక్టర్ల సేవలు ఉపయోగిస్తున్నారు. తాత్కాలిక ఉద్యోగులు చేతి యంత్రాలు ద్వారా పన్ను వసూలు చేసి రశీదులు అందజేస్తున్నారు. అనంతరం డబ్బును పురపాలక సంఘ కార్యాలయంలో క్యాష్ కౌంటర్‌లో జమ చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు డబ్బులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.






# చంద్రబాబు స్వీట్ వార్నింగ్..!

## అధికారులకు స్వీట్ వార్నింగ్.. తేడా వస్తే అంతే సంగతులు..

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు తొలిసారి కలెకర్ల సదస్సు నిర్వహించారు. రానున్న ఐదేళ్లు ప్రభుత్వ పాలన ఎలా ఉండాలి.. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో సీఎం అధికారులకు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. గతాన్ని ఎక్కువగా తవ్వకుండానే.. తప్పిదాలను మర్చిపోయి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎలా ముందుకెళ్లాల్లో స్పష్టం చేశారు. బాగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరైనా తప్పులు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని తెల్చి చెప్పారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి సీఎం జగన్ తొలి కలెక్టర్ల సదస్సును ప్రజావేదికలో నిర్వహించి.. సాయంత్రానికి ఆ భవనాన్ని కూల్చేయాలని ఆదేశించడం ద్వారా విధ్వంసంతో తన పరిపాలనను ప్రారంభించారని.. అలాంటి పొరపాట్లు ఈ ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు.

తప్పు చేయాలని తాను అధికారులకు చెప్పబోనని.. కాని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అద్భుతాలు సృష్టించగల ఎంతోమంది మంచి అధికారులు ఉన్నప్పటికీ.. వారి సేవలను ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఓ రకంగా చెప్పాలంటే ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు మొదటి సదస్సులోనే స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.

**జగన్ పేరు ఎత్తకుండానే..** చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సులో మాజీ సీఎం జగన్ పేరు ఎత్తకుండానే.. ఆయన వ్యవహారశైలిని అధికారులకు అర్థమయ్యేలా చెప్పారు. ఎమ్మెల్యేలంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశించామని, అధికారులు సైతం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అహంకారపూరిత ధోరణితో, డిక్టేటర్‌గా వ్యవహరిస్తే ఏమవుతుందో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రజలు మ్యాండేట్ ఇవ్వడంతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతామని.. వారి ఓట్లు వేస్తే మరోసారి ప్రభుత్వంలోకి వస్తామని.. లేకపోతే అసెంబ్లీకి కూడా రాలేమన్నారు.

గత ప్రభుత్వం డిక్టేటర్‌గా వ్యవహరించడంతోనే మాజీ మంత్రులంతా ఎన్నికల్లో ఓడిపోయారని కేవలం ఒకరు మాత్రమే గెలిచి అసెంబ్లీకి వచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. దీంతో అధికారులు ఎలా ఉండాలనేదానిపై సీఎం చంద్రబాబు ఓ సందేశాన్నిచ్చారు.

**ఓనర్‌షిప్ తీసుకోవాలి.. క్రెడిట్ మాత్రం...** ప్రజాప్రతినిధులతో అధికారులు ఎలా వ్యవహరించాలనేదానిపై చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో క్లారిటీ ఇచ్చారు. ప్రజల్లో ఉండేది నాయకులని.. ఐదేళ్లకోసారి ప్రజాతీర్పును కోరవల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే తక్షణమే వాటిని పరిష్కరించి.. ఆ క్రెడిట్‌ను నాయకుడికి ఇవ్వాలని.. అధికారులు ఆ సమస్యను సొంత సమస్యగా భావించి.. త్వరితగతిన పరిష్కార మార్గం చూపించాలన్నారు. మొదటి సదస్సులో ప్రారంభ ఉపన్యాసంలోనే అధికారులు ఎలా ఉండాలో చంద్రబాబు పూసగుచ్చినట్లు వివరించారు.

## ప్రైవేటు ఆస్పత్రులతో మనమెందుకు పోటీ పడలేం?: చంద్రబాబు

అమరావతి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులకు సూచించారు. కలెక్టర్లతో జరిగిన సదస్సులో ఆయన వైద్య ఆరోగ్యశాఖ, ఆస్పత్రుల పనితీరుపై పలు కీలక సూచనలు చేశారు. ఓపెన్ మార్కెట్‌తో పోటీ పడేందుకు ప్రయత్నించడంతో పాటు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ఆదేశించారు. సామాన్యుడికి మెరుగైన వైద్యం అందుబాటులోకి రావాలని, ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన వైద్యం అందాలని సీఎం ఆకాంక్షించారు. కార్పొరేట్ ఆస్పత్రులు లాభాలు ఆశించి మెరుగైన వైద్యం అందిస్తున్నప్పుడు మనం ఏ లాభాపేక్ష లేకపోయినా మెరుగైన వైద్యం ఎందుకు అందించలేక పోతున్నామని అధికారుల్ని ప్రశ్నించారు.



ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఇన్సూరెన్స్ కూడా అందరికీ యూనిఫాంగా పెట్టాలని, ప్రైవేట్ ఆస్పత్రులతో మనం ఎందుకు పోటీపడలేం అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రైవేట్ ఆస్పత్రులతో ప్రభుత్వ ఆస్పత్రులు పోటీపడాలని, దీన్ని ఓ సవాల్‌గా తీసుకొని యంత్రాంగం పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, వసతులు, విశాలమైన స్థలం అన్నీ ఉన్నాయి గనక ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు.



## భద్రతను పునరుద్ధరించాలంటూ హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం జగన్

అమరావతి: తన భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన తరఫు న్యాయవాదులు ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 3వ తేదీ నాటికి తనకున్న భద్రతను పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని జగన్ కోరారు. గతంలో కేంద్రం తనకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## రాజ్ సంపత్‌ని హత్య చేసిన వారిని శిక్షించాలి

విజయవాడ: కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది రాజ్ సంపత్‌ని దారుణంగా హత్యచేశారని, ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. పోలీసులు సంపత్‌పై కేసు ఉందని, రావాల్సిందిగా పిలిచారని చెప్పారు. ఈ కేసుతో సంబంధం లేకపోయినా కేసు పెట్టారని అన్నారు. సంపత్‌కు వాళ్ల పెదనాన్నతో విభేదాల కారణంగా మే 29 వ తేదీన బలవంతంగా పోలీసులు బయటకు తీసుకెళ్లి చంపారని ఆరోపించారు. హిందూపూర్‌లో కేసీ కృష్ణా రెడ్డి న్యాయవాది, రియల్ ఎస్టేట్, వ్యాపారస్తుడు ఈ హత్యకు కారణమని ఆరోపించారు.



**3నెలలు అవుతున్నా అరెస్ట్ చేయలేదు..? :** హత్య జరిగి మూడు నెలలు అయిందని, నిందితులకు బెయిల్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. హత్యకు కారణమైన వారు నేటికీ ఎందుకు అరెస్ట్ కాలేదని నిలదీశారు. కోడి కత్తి శీను అంశంలో ఎవరికి సాధ్యం కాని విషయంలో బెయిల్‌పై న్యాయవాది రాజ్ సంపత్ బయటకు తీసుకు వచ్చారని గుర్తుచేశారు. హిందూపురంలో హత్యకు కారణమైన వారు ఎవరో పోలీసులకు, హిందూపూర్ వాసులకు తెలుసునని చెప్పారు. ఈ విషయాన్ని హెూం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లానని, అయినా నెల గడిచినా చర్యలు శూన్యమని హర్షకుమార్ అన్నారు.

**చర్యలు శూన్యం :** సంపత్ హత్య కేసులో ఏ 1 , ఏ 2, ఏ3 లుగా పోలీసులను, ఏ 4 గా కేసీ కృష్ణారెడ్డి పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక న్యాయవాదిని చంపేస్తే , బెయిల్ ఎలా ఇచ్చారని న్యాయమూర్తి ప్రశ్నించారని అన్నారు. మూడు నెలలైనా టీడీపీ ప్రభుత్వం హంతకులను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వం చేసినట్టే టీడీపీ కూడా చేస్తుందని విమర్శించారు. ఎఫ్ఐఆర్ వేసి 40 రోజులవుతున్నా చర్యలు శూన్యమని, దళితులను హత్య చేస్తే ఎవరూ పట్టించుకోరా? అని ప్రశ్నించారు. న్యాయమూర్తిని ఒకటే కోరుతున్నామని.. న్యాయవాది సంపత్‌కు న్యాయం చేయాలని మాజీ ఎంపీ హర్షకుమార్ కోరారు.

**సంపత్‌ను హత్య చేసినా స్పందించరా: న్యాయవాది అబ్దుల్ సలీం..** చిన్న దొంగతనం చేసిన వారిని అరెస్ట్ చేసే పోలీసులు జాతీయ నాయకులు సంపత్‌ను హత్య చేసినా ఎందుకు స్పందించడం లేదని న్యాయవాది అబ్దుల్ సలీం ప్రశ్నించారు. ఈ కేసులో చాలా పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. ఈ కేసులో ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని రిట్ పిటిషన్ వేస్తున్నామని న్యాయవాది అబ్దుల్ సలీం అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే రూల్స్... మాకు ఇవ్వాల్సిందే..

విజయవాడ, ఆగస్టు 5: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు సోమవారం సమావేశం నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా పాలకులకు విజ్ఞాపన పత్రాలు అందచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు మాట్లాడుతూ... కొన్ని సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యంగా చేసినందువలన రావలసిన బకాయిల్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్ అయిన నాటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ కల్పించాలన్నారు. చీసచివాలయ ఉద్యోగులకు పదోన్నతి ఛానల్ క్రియేట్ చేసి, పదోన్నతులు కల్పించాలని అన్నారు. సచివాలయ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని.. సచివాలయ ఉద్యోగులకు ఏకరూప దుస్తులు(యూనిఫామ్) విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న రూల్స్ అన్నీ కూడా, సచివాలయ ఉద్యోగులకు కచ్చితంగా వర్తించేలా చూడాలని.. సమస్యలపై, ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ వేసి, సమస్యలన్నీ వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోటేశ్వరరావు వినతి చేశారు.




## భారత్‌లో షేక్ హసీనా.. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం..!

ఢాకా: బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేజారింది. దాంతో సైన్యం రంగంలో దిగింది. దేశం మొత్తం దాని నియంత్రణలోకి వచ్చింది. ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నిరసనకారులు హింసామార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు.

దీనికి ముందు షేక్ హసీనాకు ఆర్మీ అల్టిమేటం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆమె పదవి నుంచి దిగిపోయేందుకు 45 నిమిషాల సమయం ఇచ్చినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే రాజీనామా చేసి, సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. త్రిపుర రాజధాని అగర్తలకు హసీనా చేరుకున్నారని తెలుస్తుంది. అక్కడి నుంచి లండన్‌కు వెళ్లనున్నారని సమాచారం. "మేం తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. నిరసనల వల్ల ఈ దేశం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. ఎన్నో ప్రాణాలు పోయాయి. ఈ హింసను ఆపాల్సిన సమయం ఇది. నా ప్రసంగం తర్వాత పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను. పరిస్థితుల్లో మార్పు వస్తే.. అత్యయిక స్థితి అవసరం ఉండదు" అని ఆర్మీ చీఫ్ టీవీ ప్రసంగంలో విజ్ఞప్తి చేశారు. అప్పుడే హసీనా రాజీనామా చేసిన విషయాన్ని వెల్లడించారు. ఈ పరిణామాల వేళ.. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. అధికారాన్ని చేజిక్కించుకోవాలని యత్నించే ప్రతిఒక్కరిని అడ్డుకోవాలని సైన్యాన్ని కోరారు. "ప్రజలను, ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత. ఎన్నిక కాని ప్రభుత్వం అధికారంలో కూర్చోవడానికి ఒక్క నిమిషం కూడా అనుమతించొద్దు. ప్రధానిని గద్దె దించితే మన సాధించిన అభివృద్ధి అంతా మట్టిలో పోసినట్టవుతుంది. తిరిగిమళ్లీ పుంజుకోలేదు. మనం అలాంటి పరిస్థితిని కోరుకోం" అని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు.




ప్రకృతి సృష్టించిన విలయానికి కేరళలోని వయనాడ్ అతలాకుతలమైంది. ఈ కఠిన సమయంలో కొందరు యువత ప్రాణాలకు తెగించి, సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారిలో ప్రజీశ్ కూడా ఒకరు. కొండచరియలు విరిగిపడటంతో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రమాదాన్ని లెక్కచేయలేదు. ఎంతో మందిని కాపాడిన అతడి జాడ ఇప్పుడు తెలియకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తు గురించి తెలియగానే వయనాడ్‌లోని చూరాల్‌మలకు చెందిన ప్రజీశ్ రంగంలోకి దిగారు. తోటివారికి అవసరం అంటే ఏమాత్రం ఆలోచించకుండా సహాయం చేయడంలో ముందుంటారన్న పేరుంది. ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయని తెలియగానే, రక్షించేందుకు ప్రమాదకర కొండ ప్రాంత మార్గంలో జీప్‌లో వెళ్లారు. అలా రెండుసార్లు పలువురిని కాపాడారు. ఆ తర్వాత కుటుంబంతో కలిసి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే సహాయం కోసం మరో ఫోన్ కాల్ వచ్చింది. దాంతో మళ్లీ అదే ప్రాంతానికి జీప్‌లో వెళ్లి తిరిగి రాలేదు. చూరాల్‌మల ప్రాంతంలో ధ్వంసమైన జీప్ కనిపించింది. కానీ అతడి జాడ మాత్రం తెలియరాలేదని స్థానికులు వెల్లడించారు. "ప్రజీశ్ అంటే అందరికీ ఇష్టం. మా ఇళ్లలో ఎలాంటి కార్యక్రమమైనా ముందుండి తనవంతు సహకారం అందిస్తాడు. నా కుమార్తె పెళ్లికి అతడు చేసిన సహాయం మరువలేనిది" అని మరొకరు తెలిపారు. ఆ కొండ ప్రాంతానికి వెళ్లొద్దని చెప్పినా వినలేదని ప్రజీశ్ స్నేహితులు వెల్లడించారు. ముండక్కై ప్రాంతంలో చాలా మంది చిక్కుకుపోయారని, వారిని రక్షించాలంటూ వెళ్లాడని తెలిపారు. "అతడు మా సూపర్ హీరో. ఇప్పుడతడు మా ముందు లేడు" అంటూ వాపోయారు. కొండచరియలు విరిగిపడటంతో ముండక్కై, చూరాల్‌మల ప్రాంతాల్లో వందలాది ఇళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఆదివారం సాయంత్రం వరకు 222 మృతదేహాలను వెలికితీశారు. ఆచూకీ గల్లంతైనవారి సంఖ్య 180 వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు.

## పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు



పల్నాడు: వరదనీరు వస్తుండటంతో పల్నాడు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు.. 26,083 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి పులిచింతలకు 30,388 క్యూసెక్కులు వరదనీరు వస్తోంది. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టులో 3.61 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్ గేట్లు ఎత్తి సాగర్ నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని వదిలారు. ఇవాళ రాత్రికి అది పులిచింతల ప్రాజెక్టుకు చేరుకోనుంది. అప్పటికి మరికొన్ని గేట్లు ఎత్తేందుకు అధికారుల ప్రణాళికలు రూపొందించారు. పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు. వరద ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో ఆ మేరకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రాజెక్టులో నీటి నిల్వ లేనప్పటికీ భారీ వరద దృష్ట్యా అధికారులు గేట్లు ఎత్తారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా ఇన్ ఫ్లో ఉంది. వరద ఇంకా కొనసాగే అవకాశం ఉండటంతో ఆ ప్రాజెక్టుల నుంచి పులిచింతలకు నీరు రానుంది.






## పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 5: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా.. పిటిషన్‌ను ధర్మాసనం వాయిదా వేసింది. పల్నాడు పోలీసులు నమోదు చేసిన రెండు కేసుల్లోనూ బెయిల్ ఇవ్వాలంటూ పిన్నెల్లి పిటిషన్ వేశారు. అయితే ఈ పిటిషన్లపై విచారణను హైకోర్టు ధర్మాసనం వచ్చే వారినికి వాయిదా వేసింది. దీంతో బెయిల్ కోసం ఎంతగానో ఎదురుచూసిన పిన్నెల్లికి మరోసారి నిరాశే ఎదురైంది.

**ఇదీ విషయం...** ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈవీఎం పగలగొట్టిన కేసులో అరెస్ట్ అయిన పిన్నెల్లి ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్నారు. ఎన్నికల సందర్భంగా మే 13న పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ధ్వంసాన్ని అడ్డుకున్న టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై ఆయన దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రెంటచింతల పోలీసులు పిన్నెల్లి, ఆయన అనుచరులు మరో 15 మందిపై హత్యాయత్నం (ఐపీసీ 307), మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేరోజు నాగశిరోమణి అనే మహిళను ఆయన బూతులు తిట్టారు. ఆమె ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద పిన్నెల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక మే 14న పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వారి అనుచరులు సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఈ కేసులన్నిటిలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అరెస్ట్ నుంచి ఉపశమనం కల్పించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు తోసిపుచ్చడంతో జూన్ 26న పోలీసులు పిన్నెల్లిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. పిన్నెల్లిపై మొత్తం 14 కేసులు నమోదయ్యాయి. ఇందులో మూడు హత్యాయత్నం కేసులున్నాయి. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ గ్రామంలో ఈవీఎం ధ్వంసం ఘటన ప్రధానంగా ఉంది. అలాగే పిన్నెల్లి బెయిల్ పిటిషన్లను గుంటూరు జిల్లా కోర్టు రెండు సార్లు కొట్టివేసిన విషయం తెలిసిందే.

## కియరా స్టన్నింగ్ బ్యాక్ లెస్ బాడీకాన్ లుక్

కియారా అద్వానీ నెవ్వర్ బిఫోర్ లుక్ తో హెడ్ టర్నర్ గా మారింది. ఈ బ్యూటీ లేటెస్ట్ క్ లెస్ బాడీకాన్ లుక్ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోందంటే అతిశయోక్తి కాదు. కియరా ఫ్యాషన్ సెన్స్, బహిరంగ ప్రదర్శనలు, ఫోటోషూట్‌లు ఎప్పటికీ హాట్ టాపిక్స్. తాజాగా ఈ బ్యూటీ బ్యాక్‌లెస్ ఫాక్స్ లెదర్ వేషధారణలో మెరుపులు మెరిపించింది. స్మోకీ ఐస్... చంకీ యాక్సెసరీస్ తో కియరా స్టన్నర్ గా కనిపిస్తోంది. కియరా తో పాటు ఈ ఫోటోషూట్ లో హాట్ లేడీస్ కరీనా కపూర్ ఖాన్, సుహానా ఖాన్ కూడా ఉన్నారు. ప్రస్తుతం ఈ అద్భుతమైన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో నిప్పులు చెరుగుతోంది. కియరా స్టన్నింగ్ లుక్ కి ఫ్యాన్స్ ఫిదా అయిపోయామని



ప్రశంసిస్తున్నారు. బ్యాక్ లెస్ బాడీ కాన్ లుక్ లో కియరా టూమచ్ హాలిగా ఉందంటూ కామెంట్ చేస్తున్నారు. తన కోసం లవ్, హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. కియారా అద్వానీ ఇటీవల తన 33వ పుట్టినరోజును జరుపుకుంది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా నుండి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకోగా, అభిమానుల నుంచి విషెస్ వెల్లువెత్తాయి. జూలై 31, బుధవారం నాటికి కియరాకు 33 ఏళ్లు నిండాయి. కియరా పుట్టినరోజు సందర్భంగా శంకర్ గేమ్ ఛేంజర్ పోస్టర్‌ను విడుదల చేసారు. ప్రొడక్షన్ హౌస్ ఈ చిత్రంలో కియారా పాత్ర పేరు జాబిలమ్మ అని వెల్లడించింది. మరోవైపు కియారా క్యూలో వరుస సినిమాలు ఉన్నాయి. రణవీర్ సింగ్ సరసన కియరా డాన్ 3 లో నటించనుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 లో కూడా కియరా ఒక కథానాయికగా నటిస్తోంది. వరుసగా క్రేజీ పాన్ ఇండియా చిత్రాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉంది.

## అనసూయ హొయలు ఆ డ్రెస్సుకే అందం వచ్చేలా

యాంకర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అనసూయ క్షణం సినిమాతో మొదట నటిగా మంచి గుర్తింపు అందుకుంది. అంతకుముందు సోగ్గాడే చిన్ని నాయనా సినిమాలో గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. ఇక రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్ర అయితే అనసూయని ఏకంగా స్టార్ యాక్టర్ గా మార్చేసింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస సినిమాలతో అనసూయ బిజీ అయిపోయింది. అనసూయ నటించిన సింబ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. రీసెంట్ గా ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. అలాగే పుష్ప ది రూల్ మూవీలో నటిస్తోంది. దాంతో పాటు ఫ్లాష్ బ్యాక్, ఉల్ఫ్ అని రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. కొన్ని మూవీస్ చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు సినిమాలు చేస్తూనే అనసూయ టీవీ షోలకి జడ్జ్ గా ఈ మధ్యకాలంలో వస్తోంది. గతంలో హోస్ట్ గా అనసూయ చేసేది. పూర్తిగా యాంకరింగ్ కి గుడ్ బై చెప్పేసిన అనసూయ జడ్జ్ గా ప్రమోట్ అయ్యింది. స్టార్



మాలో శని, ఆదివారాలు ప్రసారం అయ్యే కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ అనే షోకి జడ్జ్ గా అనసూయ వస్తోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని అనసూయ షేర్ చేసుకుంటూ ఉంటుంది. అలాగే తన ఫ్యామిలీ సెలబ్రేషన్స్, వెకేషన్స్ కి సంబంధించిన పిక్స్ కూడా పంచుకుంటూ ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో అనసూయకి 1.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ బ్యూటీ గ్లామర్ ఫోటోలని ఫ్యాన్స్ తో పంచుకోవడమే కాకుండా సామాజిక అంశాల మీద కూడా అప్పుడప్పుడు రియాక్ట్ అవుతూ పోస్టులు పెడుతూ ఉంటుంది. ఇదిలా ఉంటే తాజాగా అనసూయ వైట్ కలర్ అవుట్ ఫిట్ తో అదిరిపోయే స్టన్నింగ్ లుక్స్ తో ఉన్న ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ట్రెడిషనల్ స్టైల్ లో ఉన్న ఈ కాస్ట్యూమ్స్ అనసూయ అందాన్ని మరింతగా ఎస్టాబ్లిష్ చేస్తున్నాయని చెప్పొచ్చు. కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ షోకి ఈ లుక్ లో అనసూయ హాజరైనట్లు ఆమె పోస్ట్ బట్టి అర్థమవుతోంది. స్టార్ మాలో శని, ఆదివారాలు ప్రసారం రాత్రి 9 గంటలకి ప్రసారం అయ్యే షోలో కలుద్దాం అంటూ ఈ ఫోటోలకి పోస్ట్ ని అనసూయ జతచేసింది.




## కంగువా.. అంత భయం పుట్టించగలదా?



కోలీవుడ్ స్టార్ సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ వరల్డ్ మూవీ కంగువా. ఈ సినిమా అక్టోబర్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది. భారీ బడ్జెట్ తో యూవీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సూర్య ఈ సినిమాలో డ్యూయల్ రోల్ లో కనిపించబోతున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో కంగువ మూవీ థియేటర్స్ లోకి రాబోతోంది. ప్రెజెంట్, ఫాస్ట్ కలిపి ఈ కథని శివ చెప్పబోతున్నారంట. ఓ క్యారెక్టర్ లో సూర్య ట్రైబల్ వారియర్ గా కనిపించబోతున్నారు.

ఆ పాత్ర చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్ గా కనిపించబోతున్నారు. దిశా పటాని హీరోయిన్ గా చేసింది. దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే కంగువా మూవీ నుంచి వచ్చిన పోస్టర్స్, సాంగ్స్, టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యి ఉన్నాయి. కంగువ మూవీతో కచ్చితంగా కోలీవుడ్ ఇండస్ట్రీకి 1000 కోట్ల కలెక్షన్స్ వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే బిజినెస్ కూడా చాలా వరకు కంప్లీట్ అయ్యిందంట. హిందీలో కూడా కంగువా సినిమాకి మంచి బిజినెస్ జరిగిందని తెలుస్తోంది. మూవీ కోసం ఫ్యాన్స్ మాత్రమే కాకుండా రెగ్యులర్ ప్రేక్షకులు కూడా ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా కంగువా మూవీ గురించి ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేశారు. దసరాకి రిలీజ్ కాబోతున్న కంగువాకి పోటీగా ఎవరైనా రావొచ్చు. ఎందుకంటే కంటెంట్ గురించి రాబోతున్న ఇతర సినిమాల నిర్మాతలకి అవగాహన ఉండదు. కాబట్టి లైట్ గా తీసుకోవడానికి ఛాన్స్ ఉంది. ఒక్కసారి కంగువ రిలీజ్ అయితే దానికి సీక్వెల్ గా రాబోయే కంగువా పార్ట్ 2కి పోటీగా వచ్చే ధైర్యం ఎవ్వరు కూడా చేయరు. ఈ విషయాన్ని కాన్ఫిడెంట్ గా చెబుతున్న అని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. జ్ఞానవేల్ రాజా కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజంగా కంగువా ఆ రేంజ్ లో భయం పుట్టించగలదా అనేలా కామెంట్స్ వస్తున్నాయి. ఈ సినిమా హిట్ అయితే కచ్చితంగా జ్ఞానవేల్ రాజా చెప్పిన మాటకి బలం పెరిగే అవకాశం ఉంది. అలా కాకుండా ఫలితం తేడా కొడితే మాత్రం కచ్చితంగా సోషల్ మీడియాలో అతన్ని ట్రోల్ చేసే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తోంది. ఏది ఏమైనా జ్ఞానవేల్ రాజా చేసిన కామెంట్స్ అయితే కంగువ సినిమా మీద ప్రేక్షకులలో అంచనాలు పెంచుతున్నాయని చెప్పొచ్చు.

## ఇండియన్ 2 ఓటీటీ వచ్చేది ఎప్పుడు?




కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకొచ్చిన ఇండియన్ 2 మూవీ బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలిచింది. 28 ఏళ్ళ క్రితం వీరిద్దరి కలయికలో వచ్చిన సూపర్ హిట్ మూవీ ఇండియన్ కి సీక్వెల్ గా ఈ మూవీ తెరకెక్కింది. అయితే మొదటి సినిమాతో వచ్చిన అంచనాలని ఇండియన్ 2 ఏ మాత్రం అందుకోలేకపోయింది.

ఆ సినిమా దరిదాపుల్లో కూడా సీక్వెల్ స్టోరీ లేదనే విమర్శలు వచ్చాయి. రిలీజ్ అయిన అన్ని భాషలలో ఈ మూవీ డిజాస్టర్ టాక్ సొంతం చేసుకొని ప్రేక్షకుల విమర్శలకి గురైంది. శంకర్ కి రోబో సినిమా తర్వాత ఆశించిన స్థాయిలో సక్సెస్ లు రాలేదు. అతని మీద ఆడియన్స్ కి ఎక్స్ పెక్టేషన్స్ పెరిగిపోయాయి. వాటిని అందుకోలేకపోతున్నారు. అలాగే హెవీ బడ్జెట్ లతో కథలు చెప్పడం వలన మూవీకి టాక్ బాగున్న కలెక్షన్స్ మాత్రం రాకపోవడంతో ఐ, 2.ఓ మూవీస్ ఫ్లాప్ అయ్యాయి. అయితే ఇండియన్ 2 పరిస్థితి వేరు.

ఈ సినిమా కథ కూడా ప్రేక్షకులకి నచ్చలేదు. అస్సలు ఇలాంటి ఆర్డినరీ స్టోరీని ప్రేక్షకులు శంకర్ నుంచి ఎక్స్ పెక్ట్ చేయలేదు. 250 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ మూవీ ఓవరాల్ గా 150 కోట్ల కలెక్షన్స్ కి పరిమితం అయ్యింది. కమల్ హాసన్ కెరియర్ లో కూడా బిగ్గెస్ట్ డిజాస్టర్స్ లలో ఒకటిగా ఈ మూవీ నిలిచింది. దీనికి సీక్వెల్ గా ఇండియన్ 3 కూడా ఉంటుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే ఇండియన్ 2 మూవీ ఫ్లాప్ కావడంతో ఇండియన్ 3పైన పెద్దగా బజ్ లేదు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ని నెట్ ఫ్లిక్స్ భారీ ధర చెల్లించి కొనుగోలు చేసింది. రిలీజ్ తర్వాత వచ్చిన రిజల్ట్ చూసి నెట్ ఫ్లిక్స్ తన డీల్ విషయంలో వెనక్కి తగ్గిందని, అనుకున్న ఎమౌంట్ ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదనే టాక్ వినిపించింది. ఈ కారణంగా ఇండియన్ 2 మూవీ డిజిటల్ రిలీజ్ లేట్ అయ్యే అవకాశం ఉందనే ప్రచారం నడిచింది. ఇందులో వాస్తవం ఎంత అనేది తెలియదు. కానీ ఇప్పుడు ఇండియన్ 2 మూవీ ఆగష్టు 9న నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కాబోతున్నట్లు తెలుస్తోంది.

ఈ రిలీజ్ డేట్ ఆల్ మోస్ట్ ఫిక్స్ అయినట్లే అని టాక్. థియేటర్స్ లోనే మూడు గంటల నిడివి గల ఈ సినిమాని ప్రేక్షకులు చూడలేకపోయారు. ఇప్పుడు ఓటీటీలో రిలీజ్ అయితే అందులో తప్పులని క్షుణ్ణంగా పరిశీలించి ఎత్తి చూపించే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. మూవీస్ డిజాస్టర్ అయితే సోషల్ మీడియాలో మీమ్స్ క్రియేట్ చేసేవారు రకరకాలుగా ట్రోల్స్ చేస్తారు. చిరంజీవి గాడ్ ఫాదర్, ఆచార్య సినిమాలకి ట్రోల్స్ తప్పలేదు. ఇండియన్ 2 కూడా ఈ ట్రోల్స్ నుంచి తప్పించుకోలేకపోవచ్చనే మాట వినిపిస్తోంది.

## తాప్సి పారిస్ పరువం చీరలో నెవ్వర్ బిఫోర్

ఒకప్పుడు సౌత్ లో స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగిన తాప్సి తరువాత బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ కూడా స్టార్ యాక్టర్ గా వరుస సినిమాలు చేస్తోంది. ఫీమేల్ సెంట్రిక్ కథలకి తాప్సి కేరాఫ్ అడ్రెస్ గా ఉంటుంది. బయోపిక్ లు కూడా ఎక్కువగా చేస్తోంది. మిథాలీ రాజ్ బయోపిక్ లో ఆమె నటించింది. గత ఏడాది షారుఖ్ ఖాన్ డంకీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ మూవీ పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. ఆగష్టులో తాప్సి నుంచి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకి రానున్నాయి. హసీనా దిల్ రుబాకి సీక్వెల్ గా తెరకెక్కిన ప్యార్ అవి హసీనా దిల్ రుబా మూవీ ఆగష్టు 9న థియేటర్స్ లోకి వస్తోంది. విక్రాంత్ మెస్సీ ఈ సినిమాలో తాప్సికి జోడీగా నటిస్తున్నాడు. ఆగష్టు 15న ఖేల్ ఖేల్ మెయిన్ అనే మూవీ థియేటర్స్ లోకి రాబోతోంది. ఈ మూవీ కథ పారిస్ నేపథ్యంలో ఉండబోతోంది. హాలీవుడ్ మూవీ పెర్ఫెక్ట్ స్ట్రేంజర్స్ కి రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కింది. అక్షయ్ కుమార్, తాప్సి, వాణి కపూర్ లాంటి స్టార్ యాక్టర్స్ ఈ



చిత్రంలో నటించారు. ఇదిలా ఉంటే తాజాగా తాప్సి ఇన్ స్టాగ్రామ్ లో పారిస్ లో దిగిన ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసుకుంది. బ్లాక్ శారీలో ఈ అమ్మడు హోటల్ లో దిగిన పిక్ ని పంచుకుంది. అలాగే పారిస్ రోడ్లు మీద హ్యాపీ రిఫ్రెష్ అవుతూ ఉన్న ఫోటోలు, వీడియోస్ ని పంచుకుంది. వీటిని షేర్ చేయడంతో పాటు ఖేల్ ఖేల్ మెయిన్ మూవీ ట్రైలర్ కి పబ్లిక్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందని పోస్ట్ పెట్టింది. ఇంత మంచి రెస్పాన్స్ అందించిన ప్రేక్షకులకి థాంక్స్ తెలియజేసింది. పారిస్ లో ఈ సినిమా చాలా అందంగా, లవ్ లీగా తెరకెక్కిందని పేర్కొంది. అలాగే ప్రేమ, కామెడీ కలగలిసి మూవీ ఉంటుందని మెన్షన్ చేసింది. నేను కట్టుకున్న చీర ఏదో చెబుతోంది అంటూ ఇన్ స్టాగ్రామ్ లో రాసుకొచ్చింది. తాప్సి షేర్ చేసిన ఫోటోలకి నెటిజన్లు నుంచి ఇంటరెస్టింగ్ కామెంట్స్ వస్తున్నాయి. వారం రోజుల గ్యాప్ లో తాప్సి నుంచి ఈ నెలలో రెండు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఆగష్టు 1న తాప్సి బర్త్ డే కావడం ఆమె తన పుట్టినరోజు వేడుకల్ని పారిస్ లో చేసుకున్నట్లు ఈ ఫోటోల బట్టి తెలుస్తోంది. నెటిజన్లు ఆమెకి బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు.

## ఎర్ర ఫ్రాకులో కుర్ర బ్యూటీ గుండెలు దడదడ

బాలీవుడ్ లో నటవారసురాళ్ల హవా గురించి తెలిసినదే. ఇటీవల 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తో నలుగురు నటవారసులు రంగ ప్రవేశం చేయగా, కింగ్ ఖాన్ షారూఖ్ వారసురాలు సుహానా ఖాన్ అందులో ఒకరు. సుహానా తదుపరి పాపా షారూఖ్‌తో కలిసి భారీ యాక్షన్ అడ్వెంచర్ లో నటిస్తోంది. మరోవైపు సుహానా తన ఫ్యాషన్ గేమ్‌ని పూర్తిగా మార్చేసింది. ఇటీవల తనలోని హాలి యాంగిల్ ని ప్రదర్శించేందుకు ఈ అప్ కమింగ్ బ్యూటీ ఏమాత్రం సంకోచించడం లేదు. నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో అంతర్జాలంలో అగ్గి రాజేస్తోంది. సుహానా తాజాగా రెడ్ హాట్ డ్రెస్‌లో వీకెండ్ వైబ్స్‌ని ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. ఈ బ్యూటీ ఇప్పటికి వన్ ఫిలిం వండర్. కానీ జెన్ జెడ్ ఫ్యాషన్ ఐకాన్ గా యూత్ లో వెలిగిపోతోంది. ఇటీవలి ఫోటో షూట్ కోసం ఖాన్ డాటర్ డేవిడ్ కోమా రెడ్ డ్రెస్‌లో డేట్ నైట్ ని ప్లాన్ చేసింది. ఈ దుస్తులలో స్పఘెట్టి పట్టీలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. సుహానా రెడ్ ఫ్రాకులో హొయలు పోతూ ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చిన వైనం నెట్ లో అగ్గి రాజేస్తోంది.



యువతరం వాట్సాపుల్లో ఈ ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. సుహానా తండ్రికి తగ్గ తనయగా నటనారంగంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. దానికి తగ్గట్టే యూత్ కి కిక్కిచ్చే ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. సోషల్ మీడియాల్లో ఈ భామకు భారీగా ఫాలోయింగ్ పెరుగుతోంది. ఇంతకుముందు సుహానా ఖాన్ 22వ పుట్టినరోజున అభిమానులకు చిక్ మినీ డ్రెస్‌తో ట్రీట్ ఇచ్చింది. అప్పుడు పసుపు రంగులో సింగిల్ షోల్డర్ పట్టీ డ్రెస్ లో మతులు చెడగొట్టింది. పాపులర్ మనీష్ మల్హోత్రా సహా టాప్ డిజైనర్లు ఖాన్ డాటర్స్ కోసం ప్రత్యేకంగా దుస్తులను డిజైన్ చేస్తున్నారు. ఈ దుస్తుల్లో సుహానా ప్రమోషన్ వండర్ ఫుల్. నటిగా ఖాన్ లోని చిలిపిదనాన్ని వెండితెరపైకి తేవడంలో సఫలమైతే ఈ బ్యూటీ గేమ్ డిఫరెంటుగా ఉంటుందనడంలో సందేహం లేదు. షారూఖ్- సుహానా ప్రధానపాత్రల్లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్నారు.



# తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవు

దిల్లీ: తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని హెచ్చరించారు. దిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. న్యాయకోవిదులతో చర్చలు జరిపారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై దిల్లీలో భారాస న్యాయపోరాటం చేస్తుందన్నారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమవుతుందని, భారాస తరఫున త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తామని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు.

**దళిత మహిళపై ఇంత దాష్టీకమా? :** షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసుల దాడిని కేటీఆర్ ఖండించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళిత మహిళపై ఇంత దాష్టీకమా? అని మండిపడ్డారు. 'ఇదేనా ఇందిరమ్మ పాలన? ఇదేనా ప్రజాపాలన? దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?' అని ప్రశ్నించారు. రక్షించాల్సిన పోలీసుల దగ్గరే రక్షణలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# పరిశ్రమలు పెట్టేందుకు వస్తే యువతను ప్రోత్సహిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి



మధిర: యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మధిరలో ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండాలి. సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇండస్ట్రియల్ పార్కుకు రూ.44కోట్లు కేటాయించాం. విద్య, వ్యవసాయక, పారిశ్రామిక కేంద్రంగా మధిరను నిలుపుతాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధిచేసుకొని సమగ్రాభివృద్ధి సాధించాలి. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిచ్చేందుకు సిద్ధంగా ఉంది" అన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం.. ఏఈ, డీఈకి మంత్రి ఉత్తమ్ హెచ్చరిక



కోదాడ: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడలో నీటిపారుదల శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ల పనితీరుపై పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రైతుల లేవనెత్తిన సమస్యలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంపై మంత్రి సీరియస్ అయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏఈ, డీఈని హెచ్చరించారు. అలాగే, హుజూర్‌నగర్ డీఈ నవీన్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# మధ్యాహ్న భోజనంలో కారం మెతుకులా?



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టాల్సింది పోయి.. కారం మెతుకులతో కడుపు నింపడమేమిటని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక విద్యార్థులు కారం, నూనెతో అన్నం కలుపుకొని కడుపు నింపుకొన్నారు. ప్రభుత్వం ఇంత బాధ్యతారాహిత్యంతో వ్యవహరించడం బాధాకరం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే 'సీఎం బ్రేక్ ఫాస్ట్' పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం.. ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని కోరుతున్నాను" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# చైనాలో పెళ్లిళ్లు తగ్గుముఖం

హాంకాంగ్: గతంలో చైనా అధిక జనాభా ఉన్న దేశాల్లో మొదటి స్థానంలో ఉండేది. జనాభా నియంత్రణకు అప్పట్లో అధికారవర్గాలు చర్యలు తీసుకోవడంతో క్రమంగా జననాల సంఖ్య తగ్గడంతో అధిక జనాభా ఉన్న దేశంగా భారత్ ప్రథమస్థానంలోకి వచ్చింది. తాజా లెక్కల ప్రకారం చైనాలోని జనాభా సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఒక వైపు జననాల రేటు పడిపోతుండగా మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ పెళ్లిళ్లు కూడా తగ్గుముఖం పడుతుండటంతో ప్రభుత్వ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఈ ఏడాది తొలి ఆరునెలల్లో 34 లక్షల జంటలు మాత్రమే ఒక్కటయ్యాయని అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం వివాహాల సంఖ్య 4.98 లక్షలు తగ్గిందని తెలిపారు. చైనాలో రోజురోజుకు ఉద్యోగావకాశాలు తగ్గుతుండటం దీనికి కారణమని, ఉద్యోగాల్లో స్థిరపడిన అనంతరమే వివాహాలు చేసుకోవాలనే ఆలోచన, యువకుల సంఖ్య తగ్గుముఖం పట్టడం, ఖర్చులు ఎక్కువ కావడం, మారుతున్న నిర్ణయాలు వివాహాల నమోదు తగ్గడానికి కారణాలని పేర్కొన్నారు. 2014 నుంచి దేశంలో వివాహాల సంఖ్య తగ్గుతూ వస్తోందని, కొవిడ్ మహమ్మారి అనంతరం మరింత తగ్గుదల కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ఆరు నెలల్లో కనిష్ఠంగా 34 లక్షల జంటలు మాత్రమే వివాహ బంధంలోకి అడుగుపెట్టాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉండొచ్చని దీనిని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నామన్నారు. గత కొన్నేళ్లుగా చైనాలో జననాల రేటు తగ్గిపోతుండటంతో ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం.. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. పెళ్లిళ్లు చేసుకునేవారికి, పిల్లలు కనేవారికి రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించింది. అయినప్పటికీ యువత పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడంలేదట.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు భ్రమలు తొలిగాయి



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు ఉన్న భ్రమలు తొలిగాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రైతుభరోసాపై కేబినెట్‌లో ఎందుకు చర్చించలేదు..? శాసనసభలో ఎందుకు ప్రకటించలేదు..? అని ప్రశ్నించారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

మహిళలకు రూ.2500 , ఫించన్ రూ.4000 ఇచ్చిందేమీ లేదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు.

**హెూల్ సేల్‌గా అబద్ధాలు :** రైతుబంధు, రైతుభరోసాపై ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. అరకొరగా రుణమాఫీ చేసి అంతా అయిపోయిందని భ్రమింపచేసే ప్రయత్నాలు చేస్తుందని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ హెూల్ సేల్ గా అబద్ధాలు చెప్పిందని విమర్శించారు. రైతుబంధు, రైతుభరోసా ఎగ్గొట్టి రుణమాఫీ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చిన్న, చిన్న కారణాలతో రైతుల రుణమాఫీకి ప్రభుత్వం నిరాకరిస్తుందని అన్నారు. పట్టాదార్ పాస్ బుక్ ఉండి రుణమాఫీ కానీ రైతులతో చర్చకు ప్రభుత్వం సిద్ధమా ? అని నిలదీశారు. 8374852619 వాట్సాప్ నంబర్‌కు రుణమాఫీ కానీ రైతులు తమ వివరాలు పెడితే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రుణమాఫీ కానీ రైతులకు సాయం అందిస్తామని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు.



# దేశం వీడిన షేక్ హసీనా
# ప్రధాని పదవికి రాజీనామా

బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఆదివారం ఘర్షణల్లో 100 మందికిపైగా మృతి చెందగా.. ఇప్పటివరకు మొత్తం 300 మంది చనిపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ముందుజాగ్రత్త చర్యగా ఢాకా ప్యాలెస్‌ను వీడిన ప్రధానమంత్రి షేక్ హసీనా.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఆందోళనలు ఉద్ధృతం కావడంతో పీఎం పదవికి రాజీనామా చేయడంతోపాటు దేశం విడిచి వెళ్లారు. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించింది. దేశంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న తరుణంలో ప్రధాని హసీనా, ఆమె సోదరి రెహానాలు రాజధాని ఢాకా నుంచి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఆర్మీకి చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో దేశం విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, వాళ్లు ఎక్కడికి వెళ్లారనే విషయంపై స్పష్టత లేదు. భారత్ వెళ్లి ఉండొచ్చని పలు మీడియా సంస్థలు చెబుతుండగా.. మరికొన్ని మాత్రం వేరే దేశం వెళ్లనున్నట్లు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రధానమంత్రి అధికారిక నివాసమైన గణభాబన్‌ను ముట్టడించిన వేలాది మంది ఆందోళనకారులు.. అక్కడ విధ్వంసం సృష్టించారు.

**రంగంలోకి ఆర్మీ! :** హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోన్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇప్పటికే కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆర్మీ రంగంలోకి దిగింది. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. నిరసనకారులు హింసామార్గాన్ని వీడాలని పిలుపునిచ్చారు.

హింసాత్మక ఘటన నేపథ్యంలో త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



# ఆరోగ్య బీమాపై జీఎస్టీ.. ప్రభుత్వానికి ఏడాదికి ఎంతంటే?

దిల్లీ: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై వస్తు, సేవల పన్ను తొలగించాలన్న డిమాండ్ల వేళ ఆసక్తికర గణాంకాలను కేంద్రం పార్లమెంట్ ముందుంచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంలపైనే రూ.8,263 కోట్ల జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. ఈ మేరకు లోక్‌సభ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి సోమవారం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించాలని ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సైతం ఇదే తరహా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో వీటిని తొలగించాలంటూ పలు విజ్ఞప్తులు వచ్చినట్లు పంకజ్ చౌధరి వెల్లడించారు. ఈ రెండు రకాల బీమా ప్రీమియంలపై ప్రస్తుతం 18 శాతం చొప్పున జీఎస్టీ వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, పేదలు, దివ్యాంగుల కోసం ఉద్దేశించిన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్, జన ఆరోగ్య బీమా పాలసీ, నిర్మయ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వంటి కొన్ని రకాల బీమా పాలసీ ప్రీమియంలను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు చౌధరి చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ?8,262.94 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ?7,638 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో ?5,354 కోట్లు ఆరోగ్య బీమాపై జీఎస్టీ రూపంలో వచ్చినట్లు మంత్రి చెప్పారు. జీఎస్టీ తొలగింపుపై కేంద్రం, రాష్ట్రాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



# అటువంటి నేతగా గుర్తుండిపోతారు..! నీతీశ్‌పై ప్రశాంత్ కిశోర్ ధ్వజం

పట్నా: జేడీయూ అధినేత, బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌పై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. కేంద్రంలో భాజపా తిరిగి అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించినప్పటికీ.. రాష్ట్రానికి ప్రయోజనాలు తీసుకురావడంలో ఆయన విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర మంత్రివర్గంలో ఎన్ని పదవులు దక్కించుకోవాలనే దానిపైనే ఆయన ఆందోళన చెందారని ధ్వజమెత్తారు. బిహార్‌ను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లే బదులు.. రాష్ట్రస్థాయిలో విరోధులను తప్పించేందుకు పలుకుబడిని ఉపయోగిస్తున్నారని విమర్శించారు. 'జన్ సురాజ్' ప్రచార కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో ఈమేరకు మాట్లాడారు. "బిహార్‌కు ప్రత్యేక హెూదా గురించి ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి మూసిఉన్న 20 చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ విషయంలో కేంద్రంపై నీతీశ్ ఎందుకు ఒత్తిడి తీసుకురాలేకపోయారు? దాదాపు 20 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆయన.. వచ్చిన అవకాశాలను వృథా చేసిన నేతగా గుర్తుండిపోతారు" అని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు.

అక్టోబరు 2న 'జన్ సురాజ్' పార్టీని ప్రారంభించనున్నట్లు మరోసారి తెలిపిన ఆయన.. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. ప్రశాంత్ కిశోర్ గతంలో జేడీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. క్రమశిక్షణారాహిత్యం కింద పార్టీనుంచి బహిష్కరణకు గురయ్యారు.

# పార్లమెంట్‌లో బీసీ కులగణన బిల్లు పెట్టాలి

ఢిల్లీ: పార్లమెంట్‌లో బీసీ కుల గణన బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అనురాగ్ ఠాకూర్ దిగజారి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై మాట్లాడారని అన్నారు.నిర్మల సీతారామన్ బీసీ ప్రధానమంత్రి అయ్యారని చెబుతున్నారన్నారు. పదేళ్లలో ఓబీసీ ఎంపీలం కలిసి బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని గతంలో ప్రధానమంత్రిని కలిశామని కానీ ఇప్పటి వరకు బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టలేదని మండిపడ్డారు. ఎస్సీ , ఎస్టీ ఓబీసీల్లో ఒక ఆలోచన వచ్చిందని అన్నారు. రాహుల్ గాంధీ ఒక ఆశగా ఇప్పుడు అందరికీ కనిపిస్తున్నారన్నారు. ఈసారి కులగణన జరగాలంటే రాహుల్ గాంధీ రావాలని అందరు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో బీసీ కుల గణనకు రూ. 150 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే కులగణన సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. న్యాయం జరగాలంటే కుల గణన జరగాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని చెప్పారు. కుల గణన చేపడుతామని అన్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులగణనపై ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీకి బీసీ నాయకత్వం మాత్రం కావాలన్నారు. బీజేపీ కులగణన అంశంలో వెనుకకు ఎందుకు వెళ్తుందో అర్థం కావడం లేదన్నారు. ప్రధాని మోదీ కుల గణన చేస్తాడని అనుకోవడం లేదన్నారు. బీసీలు పెద్ద ఎత్తున జంతర్ మంతర్‌లో ధర్నాలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీలో కుల గణన చేయాలని హనుమంతరావు విజ్ఞప్తి చేశారు.

# అసెంబ్లీలో బీఆర్ఎస్ పట్టుబట్టింది: ఎమ్మెల్యే కేపీ వివేకానంద



కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో వివేకానంద మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, రైతుభరోసాపై శాసనసభలో చర్చ జరపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. తెలంగాణ రైతాంగం ఆశగా ఎదురు చూస్తున్నా ఈ అంశాలపై చర్చకు అసెంబ్లీలో బీఆర్ఎస్ పట్టుబట్టిందని గుర్తుచేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని మండిపడ్డారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పినట్లే బడ్జెట్ గ్యాస్, ట్రాష్ అన్నది తేలిపోయిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ఎద్దేవా చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com